

3 లో నెల్లూరులో కృషి భవన్ ప్రారంభం

RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM

**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7569677170

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :216 సంపాదకులు: కలిచేటి వెంకయ్య శుక్రవారం 3 జూలై 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad

## ఏపీ నుంచి అమలులోకి
# వీబీజీ రామ్‌జీ పథకం

- రైల్వే కోడూరు నుంచి పథకం ప్రారంభించిన కేంద్ర మంత్రి, సీఎం, డిప్యూటీ సీఎం
- వీబీజీ రామ్‌జీతో రాష్ట్రాలకు రూ.7.5 లక్షల కోట్ల కేంద్ర నిధులు
- ప్రతీ గ్రామ పంచాయితీకి ఏడాదికి రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు
- వీబీ జీ రామ్ జీ పోర్టల్ ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- వీబీ జీ రామ్ జీ పథకం భారం కాదు బాధ్యతన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- మార్కెట్ ఇంటర్వెన్షన్ కింద తోతాపురి మామిడి కొనుగోళ్లకు కేంద్ర మంత్రి హామీ
- పీఎం ఆవాస్ యోజన, పీఎం గ్రామీణ్ సడక్ యోజన కింద రూ.422 కోట్ల నిధుల పత్రం అందజేత






**తిరుపతి, సింధూరదర్శిని:**
కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం వీబీ జీ రామ్ జీ ఏపీ నుంచి ప్రారంభమై దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. ఈ చారిత్రక ఘట్టానికి తిరుపతి జిల్లా రైల్వేకోడూరు వేదికైంది. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అజీవికా మిషన్' పథకాన్ని ఏపీ నుంచి ప్రారంభించారు. దీంతో దేశవ్యాప్తంగా ఈ పథకం అమల్లోకి వచ్చింది. ముక్కవారిపల్లి గ్రామంలో రూ.4.55 లక్షల వ్యయంతో ప్రతిపాదించిన మూడు పనుల్ని ముగ్గురు నేతలూ లాంఛనంగా ప్రారంభించారు. సామాజిక వర్షపు నీటి సంరక్షణ కుంట, మ్యాజిక్ డ్రెయిన్, మొక్కల పెంపకం కార్యక్రమాలను వీబీ జీ రామ్ జీ మిషన్ కింద తొలుత చేపట్టారు. ఈ పథకం కింద స్థానిక లబ్దిదారులకు కేంద్ర మంత్రి, సీఎం, డిప్యూటీ సీఎంలు కలిసి వీబీజీ రామ్ జీ జాబ్ కార్డులను అందజేశారు. కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, కమలేష్ పాశ్వాన్‌లు వీబీ జీ రామ్ జీ ప్రోత్సాహక గీతాన్ని ఆవిష్కరించారు. ఈ పథకం కింద సమాచార బుక్ లెట్, కంపెండియం ఆఫ్ ఆర్టికల్స్ ను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విడుదల చేశారు. వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ ఆజివికా మిషన్ పోర్టల్ ను నేతలు ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ" వీబీ జి రామ్ జీ పథకం ఏపీలోని రైల్వే కోడూరు నియోజకవర్గం నుంచి ప్రారంభమై దేశవ్యాప్తంగా అమల్లోకి రావటం చారిత్రాత్మకం. గతంలో నరేగా రాయలసీమ ప్రాంతం నుంచే ప్రారంభమైంది. ఇప్పుడు కూడా వీబీజీ రామ్ జీ పథకం ఇక్కడి నుంచే ఆవిష్కృతం అయ్యింది. కేంద్రం నుంచి రూ.7,700 కోట్లు, రాష్ట్రం మరో రూ.4 వేల కోట్ల వ్యయంతో వీబీజీ రామ్ జీ కింద పనులు చేపడతాం. రూ.11 వేల కోట్ల పైచిలుకు మొత్తంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారధ్యంలో ఈ పథకం కింద గ్రామాల రూపు రేఖలు మారతాయి. 125 రోజుల పని దినాలతో గ్రామీణ అభివృద్ధికి కావాల్సిన ఏ పనైనా చేపట్టేందుకు వీబీజీ రామ్ జీ కింద అవకాశం కల్పిస్తోంది.

మిగతా 2లో...

# అన్నాడీఎంకేకు భారీ షాక్..

- టీవీకేలో చేరిన ఇద్దరు మాజీ మంత్రులు
- 15,000 మంది అనుచరులతో పార్టీలో చేరిన సి. విజయభాస్కర్, ఎం.ఆర్. విజయభాస్కర్
- అన్నాడీఎంకే నాయకత్వంపై అసంతృప్తితోనే ఈ నిర్ణయమని ప్రకటన
- ఇది ట్రైలర్ మాత్రమేనని, మరిన్ని చేరికలు ఉంటాయని విజయభాస్కర్ వ్యాఖ్య
- పలువురు మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా స్థాయి నేతలు కూడా టీవీకేలో చేరిక



**సింధూరదర్శిని:**తమిళనాడులో అన్నాడీఎంకేకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీకి చెందిన కీలక నేతలు, మాజీ మంత్రులు డాక్టర్ సి. విజయభాస్కర్, ఎం.ఆర్. విజయభాస్కర్ అధికార తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీలో చేరారు. వీరితో పాటు సుమారు 15,000 మంది మద్దతుదారులు కూడా పార్టీ మారడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. చెన్నై సమీపంలోని మామల్లపురంలో గల ఒక ప్రైవేట్ హోటల్‌లో గురువారం ఈ భారీ చేరికల కార్యక్రమం జరిగింది. టీవీకే ప్రధాన కార్యదర్శి ఎన్. ఆనంద్ ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించారు. మంత్రి ఆధవ్ అర్జున కొత్తగా చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

మిగతా 2లో...

# అమెరికాతో వాణిజ్య ఒప్పందం..
## పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు

- భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం చర్చలు తుది దశకు చేరాయన్న గోయల్
- 99 శాతం చర్చలు పూర్తయ్యాయని తెలిపిన కేంద్ర మంత్రి
- టారిఫ్ ప్రయోజనాలపై చట్టపరమైన అంశమే చివరి అడ్డంకి అని వెల్లడి
- చైనా, ఆగ్నేయాసియా దేశాల కన్నా భారత్‌కు ప్రాధాన్యత కల్పించడమే లక్ష్యం



**న్యూఢిల్లీ:**భారత్, అమెరికా మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చర్చలు తుది దశకు చేరుకున్నాయి. ఈ ఒప్పందానికి సంబంధించిన ప్రక్రియ దాదాపు 99 శాతం పూర్తయిందని, కేవలం ఒకే ఒక్క కీలక అంశంపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. ఈ ఒప్పందం ద్వారా అమెరికా మార్కెట్‌లో ప్రాంతీయ పోటీదారుల కంటే భారత్‌కు విశేష ప్రాధాన్యత లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో నిర్వహించిన 'ఇండో–జపాన్

మిగతా 2లో...

# అమరావతిపై జగన్ మరో డ్రామా..

- రాష్ట్ర భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు: సోమిరెడ్డి
- జగన్ వ్యాఖ్యలు గందరగోళంగా ఉన్నాయన్న సోమిరెడ్డి
- రాజధానిపై కొత్త నినాదాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపణ
- అమరావతిలో వేల కోట్ల పెట్టుబడులు పెట్టామని వెల్లడి
- రైతుల త్యాగాలను గౌరవించాలని జగన్‌కు సూచన
- రాష్ట్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టీకరణ



**విజయవాడ, సింధూరదర్శిని:**
అమరావతిపై వైసీపీ అధినేత జగన్ చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా గందర గోళంగా ఉన్నాయని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. ఒకప్పుడు అమరావతికి మద్దతు తెలిపిన జగన్, తర్వాత మూడు రాజధానుల ప్రతిపాదన తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు 'మావిగన్'



## క్రాంతి కుమార్ కుటుంబానికి అండగా ఉంటాం: జగన్

బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడతామని హామీ

వివరాలు 2 లో

# సవాల్ చేసి వెనక్కి తగ్గారు.. చర్చకు దమ్ముంటే అసెంబ్లీ పెట్టండి: కేటీఆర్

- హరీశ్‌రావు అరెస్టును ఖండిస్తూ వెంటనే విడుదల చేయాలని డిమాండ్
- అప్పులు, గురుకులాల అంశంపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని డిమాండ్
- తన లెక్కలు తప్పని నిరూపిస్తే రాజీనామా చేస్తానన్న మంత్రి జూపల్లి



**సింధూరదర్శిని:**
రాష్ట్ర అప్పులు, గురుకులాల్లో అవినీతిపై చర్చకు తాము సిద్ధమని బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పునరుద్ఘాటించారు. కానీ సవాల్ చేసిన కాంగ్రెస్ మంత్రులే ఇప్పుడు వెనక్కి తగ్గారని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన సీఎం రేవంత్‌రెడ్డి మొదట చర్చకు సవాల్ విసిరారని తెలిపారు. తాము అంగీకరించాక మాట మార్చారని విమర్శించారు.

# అన్నాడీఎంకేకు భారీ షాక్..

(మొదటిపేజీ తరువాయి)

అన్నాడీఎంకే నాయకత్వంపై తీవ్ర అసంతృప్తితోనే తాము పార్టీ మారుతున్నట్లు మాజీ మంత్రులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సి. విజయభాస్కర్ మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు మరియు తర్వాత కూడా టీవీకేతో పొత్తు పెట్టుకోవాలని తాము పార్టీ అధిష్ఠానానికి పలుమార్లు సూచించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంజీఆర్ సిద్ధాంతాలకు విరుద్ధంగా డీఎంకేతో పొత్తుకు ప్రయత్నిస్తుండటంతో తాము పార్టీలో ఇమడలేకపోయామని తెలిపారు. ప్రజల్లో అపారమైన విశ్వాసం నింపిన విజయ్ నాయకత్వంలోని టీవీకేలో చేరడమే సముచితమైన నిర్ణయమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల అనంతరం జరిగిన అతిపెద్ద చేరికల్లో ఇది ఒకటి. ఈ ఇద్దరు మాజీ మంత్రులతో పాటు మరో మాజీ మంత్రి ఎస్. వలర్మతి, ఎం.ఎస్.ఎం. ఆనందన్, పలువురు మాజీ ఎమ్మెల్యేలు, 208 మంది యూనియన్ కార్యదర్శులు కూడా టీవీకేలో చేరారు. కరూర్, పుదుక్కోట్టై జిల్లాల నుంచి సుమారు 200 బస్సులు, 600 కార్లలో భారీ సంఖ్యలో మద్దతుదారులు ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. ఈ చేరికలు కేవలం 'ట్రైలర్' మాత్రమేనని, రాబోయే ఎన్నికల్లో టీవీకే వంద శాతం విజయం సాధిస్తుందని విజయభాస్కర్ ధీమా వ్యక్తం చేశారు.

# అమెరికాతో వాణిజ్య ఒప్పందం.. పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు

(మొదటిపేజీ తరువాయి)

స్ట్రాటజిక్ డైలాగ్' కార్యక్రమంలో పీయూష్ గోయల్ ప్రసంగించారు. ఈ ఒప్పందం ఇరు దేశాలకూ అత్యంత న్యాయబద్ధంగా, సమతుల్యంగా ఉంటుందని ఆయన అభివర్ణించారు. అమెరికా సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో, భారత్‌కు సుంకాల పరంగా లబ్ధి చేకూర్చేందుకు అవసరమైన చట్టబద్ధమైన యంత్రాంగాన్ని రూపొందించడమే ప్రస్తుతం మిగిలి ఉన్న ఆ ఒక శాతం అడ్డంకి అని ఆయన వివరించారు. తయారీ రంగంలో ప్రధాన పోటీదారులైన చైనా, ఆగ్నేయాసియా దేశాల కంటే భారత్‌కు మెరుగైన ప్రాధాన్యత లభించాలని కోరుతున్నామని, దీనిపై అమెరికా సానుకూలంగా స్పందిస్తూ పరిష్కారం కోసం చురుగ్గా కృషి చేస్తోందని తెలిపారు. 2025 ప్రారంభంలో ఈ సమగ్ర ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు మొదలయ్యాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో మధ్యంతర ఒప్పందానికి సంబంధించిన ముసాయిదాను ఇరు దేశాలు ప్రకటించాయి. భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ సైతం ఈ ఒప్పందం తుది దశకు చేరుకుందని, కేవలం ఒక శాతం మాత్రమే పెండింగ్‌లో ఉందని ఇటీవల వ్యాఖ్యానించారు. జూలై 24న అమెరికా తాత్కాలిక టారిఫ్ చర్యల గడువు ముగియనున్న నేపథ్యంలో, ఆలోపే తొలి విడత ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# అమరావతిపై జగన్ మరో డ్రామా..

(మొదటిపేజీ తరువాయి)

పేరుతో మరో కొత్త నినాదం తీసుకురావడం ప్రజలను అయోమయంలోకి నెట్టే ప్రయత్నమేనని ఆరోపించారు. అభివృద్ధికి, విధ్వంస రాజకీయాలకు మధ్యే అసలు పోటీ జరుగుతోందన్నారు. అమరావతిలో ఇప్పటికే వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని సోమిరెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలతో పాటు జాతీయ బ్యాంకులు, విద్యాసంస్థలు, ప్రైవేట్ కంపెనీలు అక్కడ ఏర్పాటవుతున్నాయని చెప్పారు. క్వాంటమ్ వ్యాలీ, ఏఐ యూనివర్సిటీ, ఎన్ఐడీ, ఎయిమ్స్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు అమరావతికి వస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో రాజధానిపై అనిశ్చితి సృష్టించడం రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధమన్నారు. అమరావతి కోసం రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చి త్యాగాలు చేశారని సోమిరెడ్డి అన్నారు. ప్రస్తుతం రూ.57,821కోట్ల విలువైన 97అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అమరావతి కేవలం నగరం కాదని, ఐదు కోట్ల మంది ఆంధ్రుల ఆకాంక్ష అని చెప్పారు. ప్రజల ఆస్తులు, రైతుల భవిష్యత్తును దెబ్బతీసేలా ఎలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని జగన్‌ను హెచ్చరించారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిపైనే దృష్టి పెట్టిందని సోమిరెడ్డి అన్నారు. సీఎం చంద్రబాబు అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని, మంత్రి లోకేశ్ పెట్టుబడులు తీసుకురావడానికి ప్రపంచ వ్యాప్తంగా పర్యటిస్తున్నారని చెప్పారు. గతంలో మూడు రాజధానుల ప్రతిపాదనను ప్రజలు తిరస్కరించారని, ఇప్పుడు కొత్త నినాదాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు ఫలించవని వ్యాఖ్యానించారు. రాష్ట్ర భవిష్యత్తుతో రాజకీయాలు చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు.

# సవాల్ చేసి వెనక్కి తగ్గారు.. చర్చకు దమ్ముంటే అసెంబ్లీ పెట్టండి

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి జూపల్లి కృష్ణారావు తెలంగాణ భవన్‌కు వస్తానని చెప్పి చివరకు గన్‌పార్క్‌కు వెళ్లడం ఎందుకని ప్రశ్నించారు. సవాళ్లు విసిరే ముందు వాటిని నిలబెట్టుకునే ధైర్యం ఉండాలని అన్నారు. గన్‌పార్క్‌కు వెళుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేయడాన్ని కేటీఆర్ ఖండించారు. ప్రభుత్వానికి ఏ అంశంపైనా బహిరంగ చర్చ చేపట్టే ధైర్యం లేదని ఆరోపించారు. హరీశ్‌రావు సహా అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ముందే అన్ని వాస్తవాలు చెప్పాలని భావించినా ప్రభుత్వం అడ్డుకుందని విమర్శించారు.

రాష్ట్ర అప్పులు, గురుకులాల్లో అవినీతిపై చర్చించేందుకు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. స్పీకర్ ఎలాంటి ఆంక్షలు లేకుండా పూర్తి స్థాయిలో చర్చకు అవకాశం కల్పించాలని కోరారు.

మరోవైపు గన్‌పార్క్ వద్ద మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తన సవాల్ కేటీఆర్, హరీశ్‌రావులకు కాదని తెలిపారు. నేరుగా కేసీఆర్‌కేనని స్పష్టం చేశారు. తాను చెప్పిన అప్పుల లెక్కలు తప్పని నిరూపిస్తే మంత్రి పదవితో పాటు ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేస్తానని ప్రకటించారు.



# ఏపీ నుంచి అమలులోకి వీబీ జీ రామ్ జీ పథకం







(మొదటిపేజీ తరువాయి)

రహదారులు, డ్రైనేజీలు, కాలువలు ఇలా వేర్వేరు ఆస్తుల కల్పనకు ఆస్కారం ఉండేలా ఈ పథకం వినియోగిస్తాం. జియో ట్యాగింగ్, బయోమెట్రిక్ లాంటి సాంకేతికతతో పూర్తి పారదర్శకంగా ఈ పథకం నిర్వహిస్తాం. గాలేరు నగరి నుంచి కోడూరుకు నీళ్లు తీసుకువస్తాం, జలధార ద్వారా భూగర్భ జలాలను కూడా పెంచుతాం. రాష్ట్రాలు వ్యయం చేసేలా ఈ పథకం చేపట్టటం భారం కాదు బాధ్యత. 13,226 గ్రామాల్లో ఒకే మారు గ్రామసభలు పెట్టి గిన్నిస్ రికార్డు సృష్టించిన ఘనత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కే దక్కింది. 7,000 కి.మీ. మేర సీసీ రోడ్లు, 40 వేల గోకులాలు, 15,500 నీటి తొట్టెలు, 1.07 లక్షల ఫార్మ్ పాండ్లు, 1,373 కి.మీ మేర గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, 1.66 లక్షల ఎకరాల్లో పండ్ల తోటల సాగు జరిగింది. ఉపాధి హామీ పనుల నిమిత్తం 55.44 కోట్ల పని దినాలు కల్పించి, రూ.16,695 కోట్లు ఖర్చు చేశాశీ. ఈ ఏడాది 10 వేల కి.మీ. గ్రావెల్ రోడ్లు, 1,500 కి.మీ. సిమెంట్, బీటీ రోడ్లు, 500 కి.మీ. మేజిక్ డ్రైన్లు, లక్ష ఎకరాల్లో పండ్ల తోటలు అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ముఖ్యంగా పొలాలకు వెళ్లే డొంక రోడ్లు కూడా జీ రామ్ జీ పథకం కింద నిర్మించవచ్చు". అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**రెండేళ్లలో రాష్ట్రాన్ని నిలబెట్టాం**

జల్ జీవన్ మిషన్ సహా 93 కేంద్ర ప్రాయోజిత పథకాలను గత పాలకులు నిర్వీర్యం చేస్తే వాటిని తిరిగి పునరుద్ధరించామని సీఎం అన్నారు. రూ.28 వేల కోట్లతో వివిధ పథకాలు చేపడుతున్నామని.. విధ్వంసమైన రాష్ట్రాన్ని నిలబెడతామని చెప్పి రెండేళ్లలో మాట నిలుపుకున్నామని వివరించారు. సీఎం మాట్లాడుతూ "కేంద్రం అమరావతికి సహకారం అందించింది. వేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. గొడ్డలి పార్టీ రోజుకో మాట మాట్లాడుతోంది. ఎన్నికల ముందు ఓ మాట ఎన్నికలు అయ్యాక మరో మాట మాట్లాడారు. ఇప్పుడు మావిగన్ అంటూ కొత్త పాట పాడుతున్నారు. ఇది ఎవరికైనా అర్థం అయ్యిందా. అమరావతిని ఆపటం ఎవరి తరమూ కాదు. పోలవరం ప్రాజెక్టును గోదావరి పుష్కరాల కంటే ముందే పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. విశాఖ స్టీల్ ప్లాంట్ ను నిలబెట్టటంతో పాటు రైల్వే జోన్ సాధించాం. గూగుల్ డేటా సెంటర్ తో పాటు పుట్టపర్తిలో ఆమ్కా ఫైటర్ జెట్ తయారీ యూనిట్ వస్తోంది. రాయలసీమను అన్ని రంగాల్లోనూ అగ్రస్థానంలో నిలుపుతాం. దేశంలోనే ఉద్యాన పంటలకు కేంద్రం రాయలసీమ. త్వరలోనే రూ.40 వేల కోట్లతో ప్రభుత్వం, రూ.60 వేల కోట్ల ప్రైవేటు ప్రైవేటు పెట్టుబడులు తెస్తాం. మదనపల్లిలో హార్టికల్చర్ హబ్ కు త్వరలోనే శంకుస్థాపన చేస్తాం. సత్యవేడులో హీరో మోటార్స్ సైకిళ్ల తయారీ యూనిట్ ఉంది. తిరుపతిలో బుల్లెట్ మోటార్ సైకిల్ తయారీ ప్లాంట్ వస్తోంది. ప్రజల మనిషి కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అడిగిన వెంటనే సమస్యల్ని పరిష్కరించారు. తోతాపురి మామిడి రైతులను ఆదుకునేందుకు, రహదారులు, పీఎంఏవై కోసం నిధులు ఇచ్చారు. దీనికి ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. ఈ వీబీ జీ రామ్ జీ పథకం ద్వారా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. స్వర్ణాంధ్ర ప్రదేశ్ గా ఏపీని తయారు చేయాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. బంగారం గనులు ఉన్న జొన్నగిరి పేరును చారిత్రక పేరు స్వర్ణ గిరిగా మార్చాం. నిస్వార్థంగా పనిచేసే కూటమి నేతలకు ప్రజలు సహకరించాలని కోరుతున్నాను. భారత మాతకు వికసిత్ భారత్ – తెలుగు తల్లికి స్వర్ణాంధ్ర సంకల్పం చేశాం. స్వర్ణాంధ్ర ప్రదేశ్ అన్ స్టాపబుల్. అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**ఏపీకి నేను మేనమామ**

**– కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్**

సీఎం చంద్రబాబుతో కలిసి వీబీ జీ రామ్ జీ పథకం ప్రారంభించిన అనంతరం కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. దేశంలోని గ్రామాలను అభివృద్ధి చేసేందుకే వీబీజీ రామ్ జీ కింద రూ.7.5 లక్షల కోట్లు వ్యయం చేయాలని నిర్ణయించామని అన్నారు. ఈ 9 నెలల కాలానికి ఈ పథకం కింద ఏపీకి కేంద్రం నుంచి రూ.7,700 కోట్లు విడుదల చేస్తామని అన్నారు. స్వయంగా గ్రామ సభలే పంచాయితీలో పనుల్ని నిర్దేశించుకుంటాయని తెలిపారు. తనను మధ్యప్రదేశ్‌లో అంతా మామాజీ అని పిలుస్తారని.. ఇప్పుడు ఏపీకి కూడా తాను మేనమామనే అయ్యానని మంత్రి వ్యాఖ్యానించారు. ఏ మేనమామ ఖాళీ చేతులతో రాడని.. ఏపీకి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద 74,212 పక్కా ఇళ్లు, గ్రామీణ ప్రాంతాలను అనుసంధానించే రోడ్ల నిర్మాణానికి రూ.422 కోట్ల నిధులు ఇవ్వనున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించిన పత్రాలను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎంలకు ఆయన అందజేశారు. అలాగే 2,16,250 మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడిని మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద కేంద్రం కొనుగోలు చేస్తుందని ఆయన ప్రకటించారు. దీనికి సంబంధించిన పత్రాలను కూడా సీఎం చంద్రబాబుకు ఆయన అందజేశారు. ఏపీకి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఎక్కడా చేయి విడిచి పెట్టేది లేదని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ తమ పుట్టిన రోజున కనీసం ఒక మొక్క నాటేలా సంకల్పం తీసుకోవాలని మంత్రి పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, కమలేష్ పాశ్వాన్, మంత్రులు సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే అరవశ్రీధర్ సహా ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# క్రాంతి కుమార్ కుటుంబానికి అండగా ఉంటాం: జగన్

**ఆత్మహత్య చేసుకున్న దళిత యువకుడు క్రాంతి కుమార్ కుటుంబాన్ని పరామర్శించిన జగన్**

**పోలీసు వేధింపుల వల్లే క్రాంతి మృతి చెందాడని ఆరోపణ – సీఎం రక్షణ వల్లే దోషులు తప్పించుకుంటున్నారని జగన్ విమర్శ**

**బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడతామని హామీ**

విజయవాడ, సింధూరదర్శిని: విజయవాడలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న దళిత యువకుడు క్రాంతి కుమార్ కుటుంబాన్ని వైసీపీ అధినేత జగన్ గురువారం పరామర్శించారు. క్రాంతి కుమార్ భార్య, పిల్లలు, తండ్రిని ఓదార్చిన జగన్, వారికి న్యాయం జరిగే వరకు తమ పార్టీ అండగా నిలిచి పోరాడుతుందని భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడిన జగన్.. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందనడానికి క్రాంతి కుమార్ ఆత్మహత్యే నిదర్శనమని అన్నారు. "ఆత్మహత్య చేసుకునే ముందు క్రాంతి కుమార్ స్వయంగా సెల్ఫీ వీడియో తీసి, సీఐ నాగరాజు, ఇతర పోలీసుల వేధింపుల గురించి వివరించారు. అయినా ఇంతవరకు బాధ్యులపై చర్యలు తీసుకోలేదు" అని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఎనిమిదేళ్ల క్రితం నమోదైన చిన్న కేసుల కోసం



గత మూడు నెలలుగా రోజూ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వేధించడం వల్లే అతను ప్రాణాలు తీసుకున్నాడని ఆరోపించారు. ముఖ్యమంత్రి నివాసానికి, డీజీపీ, హోంమంత్రి కార్యాలయాలకు కూతవేటు దూరంలో ఈ ఘటన జరిగిందని జగన్ అన్నారు. "సీఐని కమిషనర్, కమిషనర్‌ను డీజీపీ, డీజీపీని ముఖ్యమంత్రి కాపాడుతున్నారు. ఇది ఒక ప్రొటెక్షన్ రాకెట్‌లా నడుస్తోంది" అని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు.

ఈ ఘటనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా నమోదు చేయకపోవడం దారుణమన్నారు. క్రాంతి కుమార్ కుటుంబానికి న్యాయపరమైన సహాయంతో సహా అన్ని విధాలా అండగా ఉంటామని జగన్ స్పష్టం చేశారు. ఈ వార్త మీకు నచ్చిందా?.. నచ్చిన వార్తలను మీ మిత్రులతో కూడా పంచుకోండి.

# ఉప ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

రేణిగుంట (సింధూర దర్శిని) 2 జూలై తిరుపతి జిల్లా ; తిరుపతి జిల్లా పర్యటన నిమిత్తం గురువారం ఉదయం రేణిగుంట విమానాశ్రయంకు చేరుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి ఘనస్వాగతం లభించింది. తిరుపతి, రైల్వే కోడూరు ఎమ్మెల్యేలు ఆరని శ్రీనివాసులు, అరవ శ్రీధర్, హ్యాండ్ క్రాఫ్ట్ ఛైర్మెన్ పసుపులేటి హరిప్రసాద్, శ్రీకాళహస్తి టెంపుల్ ఛైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, అడిషనల్ ఎస్పీ శ్రీలత, శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్‌రెడ్డి, తదితరులు ఉప ముఖ్యమంత్రి పవన్



కల్యాణ్‌కి గణ స్వాగతం పలికారు. అనంతరం రైల్వే కోడూరు నియోజకవర్గ, ఓబులవారిపల్లె, ముక్కావారి పల్లె లో వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్–గ్రామీణ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు.





## డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించిన కమిషనర్

నెల్లూరు ( సింధూర దర్శిని) 2 జూలై నెల్లూరు జిల్లా; 117 – నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమ నిర్వహణలో భాగంగా సూపర్వైజర్లు, బూత్ లెవెల్ ఆఫీసర్లు చేపడుతున్న డిజిటలైజేషన్ ప్రక్రియను కమిషనర్ గురువారం ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. స్థానిక జాకీర్ హుస్సేన్‌నగర్, రాజీవ్‌గాంధీకాలనీ ప్రాంతంలోని 151 వ పోలింగ్ బూత్ పరిధిలోని బూత్ లెవెల్ అధికారి డిజిటలైజేషన్ ప్రక్రియలో తక్కువ శాతం నమోదు ఉన్న కారణంగా ఈ.ఆర్.ఓ/ కమిషనర్ వై.ఓ నందన్ క్షేత్రస్థాయిలో జరుగుతున్న సమగ్ర ఓటర్ జాబితా డిజిటలైజేషన్ ప్రక్రియను పర్యవేక్షించారు. మొబైల్ ఫోన్ ద్వారా సిబ్బంది చేస్తున్న డిజిటలైజేషన్ ప్రక్రియను కమిషనర్ పరిశీలించి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.స్థానిక ఆర్.ఎస్.ఆర్ హైస్కూల్ ప్రాంగణంలో జరుగుతున్న ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను కమిషనర్ స్వయంగా పర్యవేక్షించి మొబైల్ ఫోన్ యాప్ ద్వారా సూపర్వైజర్లు, బి.ఎల్.ఓలు చేస్తున్న డిజిటలైజేషన్ ప్రక్రియను కమిషనర్ పరిశీలించారు. వివిధ అంశాలపై అవగాహన పెంచుకొని నిర్దేశించిన సమయంలోపు ప్రక్రియ ను పూర్తి చేయాలని సూచించారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా కార్య క్రమంలో భాగంగా డిజిటలైజేషన్ ప్రక్రియకు అవసరమైన ఎన్యుమరేషన్ ఫారంలను నింపడంలో వివిధ సూచనలను సిబ్బందికి జారీ చేశారు.

## ఉమాదేవి సేవలు అభినందనీయం


**టిడిపి రాష్ట్ర మాజీ కార్యదర్శి నెలబల్లి భాస్కరరెడ్డి**




గూడూరు (సింధూర దర్శిని) 2 జూలై నెల్లూరు జిల్లా ; నెల్లటూరు అంగన్వాడీ కేంద్రంలో పేద పిల్లలకు అంగన్వాడీ కార్యకర్త తాడేపల్లి ఉమాదేవి అందించిన సేవలు అభినదనీయమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి నెలబల్లి భాస్కర్ రెడ్డి తెలియజేశారు. గూడూరు రూరల్ మండలం నెల్లటూరు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో కార్యకర్తగా పనిచేస్తున్న తాడేపల్లి ఉమాదేవి పదవీ విరమణ కార్యక్రమాన్ని గూడూరు పట్టణంలోని మెయిన్ అంగన్వాడీ కార్యాలయంలో వారు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఉమాదేవిని ఘనంగా సన్మానించి ఆయన సొంత నిధులు 50వేల రూపాయల నగదు చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సీడీపీఓ ఎస్.కే మెహబూబి,ఏసీడీపీఓ శారదాంబ,సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## డిజిటలైజేషన్ త్వరితగతిన పూర్తి చేయాలి

**చిల్లకూరు తాసిల్దార్ గోపీనాథ్ రెడ్డి**



గూడూరు (సింధూర దర్శిని) 2 జూలై నెల్లూరు జిల్లా ; డిజిటలైజేషన్ త్వరితగతిన పూర్తి చేయాలని తాసిల్దార్ గోపీనాథ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ చిల్లకూరు మండలం లోని తమ్మిన పట్టణం , లింగవరం ,వరగలి , మోమిడి గ్రామాల నందు ఎలక్షన్ సర్ ప్రోగ్రాం సంబంధించి పోలింగ్ స్టేషన్ పరిధిలోని బి ఎల్ వో లను సందర్శించి ఎన్యుమరేషన్ ఫామ్స్ డిజిటలైజేషన్ చేయుటకు గ్రామాలలో సందర్శించి జూలై మొదటి వారం లోపు సర్ ప్రోగ్రాం డిజిటలైజేషన్ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాల జారీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ పూర్ణచంద్ వీఆర్వో బాలాజీ తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన ఇండస్ట్రియల్ సెక్రటరీ

గూడూరు (సింధూర దర్శిని) 2 జూలై నెల్లూరు జిల్లా ; చిల్లకూరు మండల పరిధిలోని తమ్మిన పట్టణం గ్రామంలో జరుగుతున్న క్రిస్ సిటీ అభివృద్ధి పనులను గురువారం ఇండస్ట్రియల్ సెక్రెటరీ యువరాజ్



పర్యవేక్షించి ,తగు సూచనలు సలహాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ అరుణకుమారి , తాసిల్దార్లు చిల్లకూరు తాసిల్దార్ గోపీనాథ్ రెడ్డి , కోట తాసిల్దార్ జై జై రావు , తిరుపతి ఏపీఐఐసీ జడ్ ఎం , నెల్లూరు ఏపీఐఐసీ జెడ్ ఎమ్ , బి వి ఎస్ ఆర్ కంపెనీ జనరల్ మేనేజర్ రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### 125 రోజులు పని దినాలు పెంపుతో....

# పేదల జీవితాల్లో వెలుగు

**ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్**
**ఉపాధి హామీ పథకాన్ని వికసిత్ భారత్ – జి రామ్ జిగా మార్పు**



గూడూరు (సింధూరదర్శిని) 2 జూలై నెల్లూరు జిల్లా; కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి పథకాలను అధికారులు, నాయకులు పేద ప్రజల్లోకి తీసుకెళ్ళి వారికి అవగాహన కలిగించాలని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సూచించారు. బుధనం గ్రామంలో గురువారం నిర్వహించిన వికసిత్ భారత్ – జి రామ్ జి 125 రోజుల గ్రామీణ ఉపాధి పథకాన్ని ఆయన నాయకులతో కలిసి ప్రారంభించారు.చిల్లకూరు మండలం బుధనంలో ఉపాధి హామీ పథకం పేరును వికసిత్ భారత్ జి రామ్ జీ గా మార్చిన సందర్భంగా ఆ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ టిడిపి సీనియర్ నాయకులు



తానంకి నానాజీ తో కలసి ప్రారంభించారు... ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 100 రోజుల పని దినాన్ని 125 రోజులకు పెంచి పేదల జీవితాల్లో వెలుగులు నింపిందని అన్నారు... ఉపాధి హామీ పథకం పేరు మార్పును ప్రతి ఒక్కరికి తెలియజేయాల్సిన అవసరం ఉద్యోగులపై ఉందని, ప్రధానమంత్రి మోడీ చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ల కృషితోనే ఇది సాధ్యమైందని అన్నారు.టిడిపి పేదల పార్టీ అని.. అమరావతికి మావిగన్ పోటీ అని జగన్ చెప్పడం హాస్యాస్పదం అని అన్నారు. ఐదేళ్లు రాష్ట్రానికి రాజధాని లేకుండా పరిపాలించిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దువ్వూరు రాజశేఖర్ రెడ్డి, సీఏ సురానేని రామచంద్ర రావు, లైవ్ స్టాక్ డైరెక్టర్ గుండాల లీలావతి, అన్నం మునిశేఖర్ గౌడ్, కోట సతీష్ యాదవ్, చిల్లకూరు పిఎస్సిఎస్ అధ్యక్షులు కొండా రామచంద్ర రెడ్డి, యశ్వంత్, కీరవాణి, మేకల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరులో కృషి భవన్ ప్రారంభం


**ప్రాథమిక రంగ అభివృద్ధికి మరింత ఊతం**
**జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**



నెల్లూరు ( సింధూర దర్శిని) 2 జూలై నెల్లూరు జిల్లా ; జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన సమావేశ మందిరం 'కృషి భవన్' ను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా ఆర్థికాభివృద్ధిలో వ్యవసాయం, ఉద్యానవనం, మత్స్య, పశుసంవర్ధక రంగాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. జిల్లా స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో ఈ రంగాల వాటా సుమారు 34 శాతం ఉండగా, జిల్లా జనాభాలో దాదాపు 60 శాతం మంది జీవనోపాధి కోసం ఈ రంగాలపైనే ఆధారపడుతున్నారని పేర్కొన్నారు.రైతులకు ప్రభుత్వ పథకాలు, ఆధునిక వ్యవసాయ సాంకేతికతలను క్షేత్రస్థాయిలో చేరవేసేందుకు ప్రతి గ్రామం నుంచి ఒక రైతును 'ఛాంపియన్ ఫార్మర్‌గా ఎంపిక చేసే కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విధానం ద్వారా రైతులకు మెరుగైన అవగాహన, శిక్షణ అందుతోందని చెప్పారు. వ్యవసాయ, ఉద్యానవన, ఏపీఎంఐపీ, పశుసంవర్ధక, మత్స్యశాఖ అధికారులు సమన్వయంతో ఒక బృందంలా పనిచేస్తూ రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నారని కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ సత్యవాణిని సత్కరించారు.రైతులకు క్రమబద్ధమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు, వారితో ప్రత్యక్షంగా సమావేశాలు ఏర్పాటు చేసేందుకు 'కృషి భవన్' ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ భవన నిర్మాణాన్ని తక్కువ సమయంలో పూర్తి చేసిన పంచాయతీరాజ్ శాఖ అధికారులను ప్రత్యేకంగా అభినందించారు.రాబోయే రోజుల్లో ప్రాథమిక రంగంలో వాల్యూ అడిషన్పై ప్రత్యేక దృష్టి సారించి, ప్రభుత్వ పథకాల అమలును మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా చేపట్టాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు రూ.10లక్షల సాయం

**ప్రభుత్వ పరిహార చెక్కు అందజేసిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి**



నెల్లూరు( సింధూర దర్శిని) 2 జూలై నెల్లూరు జిల్లా ; రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన ఇద్దరు చిన్నారులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 లక్షల చెక్కును కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గురువారం నెల్లూరులోని తన కార్యాలయంలో అందజేశారు. గత ఏడాది సెప్టెంబర్ 17న ఇందుకూరుపేట మండలం అరుంధతి వాడకు చెందిన చల్లగుండ్ల శీనయ్య, ఆయన భార్య లక్ష్మి ఆత్మకూరు వెళ్లి తిరిగి వస్తుండగా సంగం సమీపంలో వారి కారును లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శీనయ్య, లక్ష్మి మృతి చెందారు. ఈ విషాద ఘటనతో వారి కుమార్తె చందు ప్రియ, కుమారుడు విశ్వాంత్ అనాథలుగా మిగిలారు. ప్రమాదం జరిగిన వెంటనే ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, చిన్నారులకు ధైర్యం చెప్పారు. అనంతరం తన వంతు బాధ్యతగా, ఇద్దరు పిల్లల పేరిట రూ.1 లక్ష చొప్పున బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, సంబంధిత పత్రాలు అందజేశారు. ఇద్దరు పిల్లలకు 18 ఏళ్ల వరకు అంగన్వాడీ తరపున నెలకు రూ.4 వేలు అందేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు మృతులిద్దరికీ ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.10 లక్షల ప్రభుత్వ పరిహారం మంజూరైంది. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ద్వారా అందిన చెక్కును ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, చిన్నారుల భవిష్యత్తు

# గ్రామీణ పేదల జీవనోపాధికి వీబీ-జీ రామ్‌జీ పథకం వరం

డబుల్ ఇంజిన్ ప్రభుత్వంతో రూ.14 లక్షల కోట్ల నిధులు

గ్రామీణ పేదలకు ఏడాదికి 125 రోజుల ఉపాధి

నియోజకవర్గంలో దాదాపు 18,929 కుటుంబాలకు ఏటా రూ.17.51 కోట్ల ప్రయోజనం

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



కోవూరు (సింధూర దర్శిని) 2 జూలై నెల్లూరు జిల్లా ; గ్రామీణ పేద కుటుంబాలకు స్థిరమైన ఉపాధి, ఆదాయ భద్రత కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 'వికసిత్ భారత్--గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్--గ్రామీణ్ (వీబీ-జీ రామ్‌జీ)' పథకం రూపొందించిందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. గురువారం రామన్నపాళెం పంచాయతీలో వీబీ జీ రామ్ జీ ప్రారంభోత్సవంలో ఆమె మాట్లాడారు. ఎన్నో ఆర్థిక సమస్యలతో ఉన్న రాష్ట్రాన్ని ప్రజలు కూటమి ప్రభుత్వానికి అప్పగించారని, అయినప్పటికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండేళ్లలోనే ఎన్నికల హామీలలో అత్యధిక భాగాన్ని అమలు చేశారని పేర్కొన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా మిగిలిపోవాల్సిన మనకు కొత్త దిశను చూపిన నాయకుడు చంద్రబాబు అని కొనియాడారు. ఇందుకు ప్రధాని మోదీ గొప్ప సహకారం అందించారని తెలిపారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ప్రభుత్వం ఉండటం వల్ల గత రెండేళ్లలో కేంద్రం నుంచి రూ.14 లక్షల కోట్ల విలువైన నిధులు రాష్ట్రానికి లభించాయని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని ప్రశాంతి రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం వీబీ-జీ రామ్‌జీ పథకం అధికారిక జాతీయ ప్రారంభోత్సవానికి ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేసిందని పేర్కొన్నారు. తిరుపతి జిల్లా ఓబులవారిపల్లె మండలం ముక్కావారిపల్లి గ్రామంలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ , ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ పథకాన్ని ప్రారంభించారని చెప్పారు. గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెంచడం, గ్రామీణ కుటుంబాలకు జీవనోపాధి భద్రత కల్పించడం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే వివరించారు. వ్యవసాయ పనులకు ఆటంకం కలగకుండా పంట నాట్లు, కోత సమయంలో 60 రోజుల పని విరామం కల్పించడంతో పాటు, గ్రామీణ పేదలకు ఏడాదికి 125 రోజుల ఉపాధి కల్పించేలా ఈ పథకాన్ని రూపొందించారని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్‌లో కార్మికులకు రోజువారీ కూలీని రూ.312గా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని, గతంతో పోలిస్తే రూ.5 పెంపు చేసినట్లు తెలిపారు. కొత్త గ్రామీణ రోజ్‌గార్ గ్యారంటీ కార్డులు జారీ అయ్యే వరకు ప్రస్తుతం ఉన్న ఈ-కేవైసీ ఎంజీఎన్ఆర్ఈజీఏ జాబ్ కార్డులే చెల్లుబాటవుతాయని స్పష్టం చేశారు. జాబ్ కార్డులు లేని కార్మికులు గ్రామ పంచాయతీలో నమోదు చేసుకుంటే సరిపోతుందని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

**కోవూరు కు 17.51 కోట్ల ప్రయోజనం**

పనులు పూర్తయిన 15 రోజుల్లోపు వేతనాలు చెల్లిస్తారని తెలిపారు. ఈ పథకం వ్యయంలో కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం భరిస్తాయని చెప్పారు. దేశవ్యాప్తంగా ఈ పథకం అమలుకు ఏటా రూ.1,51,282 కోట్లు వ్యయం చేయనున్నారని, గత ఏడాదితో పోలిస్తే ఈసారి కేంద్ర ప్రభుత్వం అదనంగా రూ.17 వేల కోట్లు కేటాయించిందని తెలిపారు. కోవూరు నియోజకవర్గంలో ఈ పథకం ద్వారా ఏడాదికి 18,929 కుటుంబాలకు సుమారు రూ.17.51 కోట్ల మేర ప్రయోజనం అందుతుందని ఎమ్మెల్యే తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలో 3,156 కుటుంబాలకు రూ.2.78 కోట్లు, కోవూరు మండలంలో 3,074 కుటుంబాలకు రూ.2.72 కోట్లు, ఇందుకూరుపేట మండలంలో 4,426 కుటుంబాలకు రూ.4.77 కోట్లు, కొడవలూరు మండలంలో 3,590 కుటుంబాలకు రూ.3.87 కోట్లు, విడవలూరు మండలంలో 4,683 కుటుంబాలకు రూ.3.36 కోట్ల మేర ఉపాధి కల్పిస్తున్నట్లు వెల్లడించారు. గ్రామీణ కార్మికులు ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని తమ కుటుంబాల ఆర్థికాభివృద్ధికి ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పిలుపునిచ్చారు.

# నెల్లూరు ప్రభుత్వ స్కూళ్లకు కార్పొరేట్ హంగులు

పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ - ఆర్.ఎస్.ఆర్ స్కూల్‌లో మంత్రి నారాయణ ఉన్నత స్థాయి సమీక్ష

ప్రభుత్వ విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు - పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్య

కలెక్టర్ హిమాన్షు శుక్లా, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, పొంగూరు శరణిలతో కలిసి ఉపాధ్యాయులతో సమీక్ష

గత ఐదేళ్లుగా మూతపడిన వి.ఆర్ స్కూల్‌ను ప్రభుత్వం రాగానే పునఃప్రారంభించాం

దాతలు దేవిరెడ్డి సుధాకర్ రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిల సహాయంతో అద్భుతంగా మారిన స్కూళ్లు

పాత రేకుల షెడ్ల స్థానంలో కోట్లాది రూపాయలతో 41 అధునాతన గదుల నిర్మాణం

నారాయణ విద్యాసంస్థల ఫౌండేషన్ సపోర్ట్ - స్టడీ మెటీరియల్‌తో ప్రభుత్వ విద్య బలోపేతం

ప్రభుత్వ స్కూళ్లలో విద్యా ప్రమాణాలపై జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిరంతర సమీక్షలు

నగరంలోని 15 పాఠశాలలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని జెడ్పీ స్కూళ్లను కూడా మోడల్ స్కూల్స్‌గా తీర్చిదిద్దుతాం



నెల్లూరు ( సింధూర దర్శిని) 2 జూలై నెల్లూరు జిల్లా ; నెల్లూరులో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి విద్యావ్యవస్థలో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతున్నట్లు రాష్ట్ర పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. స్టోన్ హౌస్ పేటలోని ఆర్.ఎస్.ఆర్ పాఠశాల ఆధునీకరణ పనులను గురువారం మంత్రి పరిశీలించారు., జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, కుమార్తె పొంగూరు షరణిలతో కలిసి ఉపాధ్యాయులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్ఎస్ ఆర్ లో పాత రేకుల షెడ్ల స్థానంలో 41 గదులతో అత్యాధునిక భవనాలను నిర్మించడమే కాకుండా, నారాయణ విద్యాసంస్థల ఫౌండేషన్ సపోర్ట్‌తో ప్రభుత్వ స్కూళ్లలోనే కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యను అందిస్తామని మంత్రి తెలిపారు. నగరంలోని 15 స్కూళ్లతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని జెడ్పీ స్కూళ్లను కూడా ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు...గత ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి గురై మూతపడి ఉన్న వి.ఆర్ స్కూల్‌ను, కూటమి ప్రభుత్వం రాగానే ఇచ్చిన హామీ మేరకు వెంటనే పునఃప్రారంభించామని తెలిపారు. ఈ స్కూల్లో కేవలం 1,000 సీట్లు ఉంటే, రికార్డు స్థాయిలో 2,000 మందికి పైగా విద్యార్థులు అడ్మిషన్ల కోసం పోటీ పడటం ప్రభుత్వ పాఠశాలలపై పెరిగిన నమ్మకానికి నిదర్శనమన్నారు. ఇదే స్ఫూర్తితో నెల్లూరు నగరంలోని మరో 15 పాఠశాలలను దాతల సహకారంతో కార్పొరేట్ స్థాయిలో డెవలప్ చేయాలని నిర్ణయించామని, దాతలు దేవిరెడ్డి సుధాకర్ రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ల ఆర్థిక సహాయంతో కోట్ల వ్యయంతో నూతన భవనాలను నిర్మించామన్నారు. మౌలిక సదుపాయాలకే పరిమితం కాకుండా, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించేందుకు నారాయణ విద్యాసంస్థల ప్రతినిధి పొంగూరు షరణి నేతృత్వంలో ప్రత్యేక ఫౌండేషన్ కోర్సులు, స్టడీ మెటీరియల్, మరియు క్వశ్చన్ పేపర్లను ఉచితంగా అందజేస్తూ అండగా నిలుస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ స్కూళ్లలో ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు, కష్టపడే విద్యార్థులు ఉన్నారని...వారికి సరైన మార్గదర్శకత్వం అందిస్తే అద్భుతాలు సాధిస్తారన్నారు. స్కూళ్లలో విద్యా ప్రమాణాలపై నిరంతర నిఘా ఉంచేందుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా సమీక్షలు జరుగుతాయని, నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని జెడ్పీ స్కూళ్లను కూడా వేగంగా ఆధునీకరించి ప్రభుత్వ విద్యా రంగంలో సరికొత్త రికార్డు సృష్టిస్తామని మనారాయణ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్, డిఈఓ బాలాజీ రావు, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ, మాజీ జెడ్పిటిసి విజేతా రెడ్డి, కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి, ప్రభుత్వ హైస్కూల్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# క్రైం న్యూస్

## ఇద్దరూ నిందితులకు 7 సంవత్సరాలు జైలు శిక్ష

నెల్లూరు (సింధూర దర్శిని) 2 జూలై నెల్లూరు జిల్లా ; జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల ఆదేశాల మేరకు జిల్లా పోలీసు శాఖ అమలు చేస్తున్న కోర్టు మానిటరింగ్ సిస్టమ్ ద్వారా కేసులపై నిరంతర పర్యవేక్షణ, సమన్వయం చేపట్టడంతో మరో కీలక కేసులో నిందితులకు శిక్ష పడింది. దగదర్తి పోలీస్ స్టేషన్ క్రైం నెం. 7/2023, సెక్షన్లు 448, 307, 326 తీ/ష 34 ఖ్రాజ కింద నమోదైన కేసులో, 2023 జనవరి 16న తురిమెర్ల గ్రామంలో క్రికెట్ ఆడే సమయంలో జరిగిన గొడవను మనసులో పెట్టుకుని నిందితులు ఫిర్యాదుదారుడి ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి బయటకు లాగి దాడి చేశారు. మొదటి నిందితుడు మొద్దు కత్తితో తలపై దాడి చేయగా, రెండో నిందితుడు ఇనుప రాడ్‌తో చెవి భాగంలో తీవ్ర గాయాలు చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. అనంతరం బాధితుడిని చికిత్స నిమిత్తం కావలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ కేసులో సాక్ష్యాధారాలను సమర్థవంతంగా కోర్టు ముందు ప్రవేశపెట్టి, జిల్లా పోలీసు శాఖ చేపట్టిన కోర్టు మానిటరింగ్ సిస్టమ్ పర్యవేక్షణతో కేసును వేగంగా ముందుకు తీసుకెళ్లిన ఫలితంగా, నిన్న సాయంత్రం కోవూరు అదనపు సెషన్స్ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. నిందితులు జాజుల శ్రీనివాసులు (ఆ1), మండాటి సుమన్ (ఆ2) లకు కోర్టు ఈ క్రింది విధంగా శిక్షలు విధించింది. ఈ కేసులో సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించిన దర్యాప్తు అధికారి ఎస్. సుమన్, ఎస్ఐ, కేసును పటిష్టంగా వాదించిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. స్టాలిన్ బాబు, కోర్టు మానిటరింగ్‌లో భాగంగా సమన్వయం నిర్వహించిన సి ఎం ఎస్ అధికారి ఎస్ఐ కె. సుమన్, కోర్టు లైజన్ అధికారి హెడ్ కానిస్టేబుల్ జి. శ్రీనివాసులు, కోర్టు పీసీ జి. మస్తానయ్యల సేవలను జిల్లా పోలీసు యంత్రాంగం అభినందించింది. జిల్లా పోలీసు శాఖ అమలు చేస్తున్న కోర్టు మానిటరింగ్ సిస్టమ్ ద్వారా ప్రతి కీలక కేసును నిరంతరం పర్యవేక్షిస్తూ, నేరస్తులకు చట్టపరమైన శిక్షలు పడేలా చర్యలు కొనసాగిస్తున్నామని జిల్లా పోలీసు అధికారులు తెలిపారు.

## మహిళ అనుమానస్పద మృతి



గూడూరు (సింధూర దర్శిని) 2 జూలై నెల్లూరు జిల్లా ; మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన గూడూరు లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాలు మేరకు గూడూరు ఒకటవ పట్టణం వలయానందపురంలో గురువారం గోపి దేశి పార్వతి (36) వయసు గల మహిళ మృతి చెందినట్లు తెలిపారు. ఆమెకు 14 సంవత్సరాల క్రితం పెద్దల సమక్షంలో గోపి దేశి వెంకటేశ్వర్లతో వివాహం జరిగిందని వారికి ఇద్దరు మగపిల్లలు జోష్ కుమార్(13) , భాను కుమార్ (11) ల వయసు గల పిల్లలు ఉన్నారని, ఈ కేసు పై పూర్తి వివరాలు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# డ్రైవర్ రమణయ్య సేవలు అభినందనీయం

డిప్యూటీ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



నెల్లూరు( సింధూర దర్శిని) 2 జూలై నెల్లూరు జిల్లా ; జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖలో డ్రైవర్ గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన వేముల రమణయ్య సేవలు అభినందనీయమని డిప్యూటీ డైరెక్టర్ పి వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం నెల్లూరులోని డిఐపిఆర్‌వో కార్యాలయంలో డ్రైవర్ గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన రమణయ్యకు ఆత్మీయ అభినందన సభ ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిఐపిఆర్‌వో కార్యాలయ అధికారులు, సిబ్బంది రమణయ్య పనితీరును ప్రశంసించారు. డిప్యూటీ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ 30 సంవత్సరాలపాటు డ్రైవర్ గా రమణయ్య అంకితభావం, నిజాయితీతో పనిచేశారని కొనియాడారు. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఆఫీస్ వాహనాన్ని సొంత వాహనంగా చూసుకున్నారని, తోటి సిబ్బంది అందరితో ఆప్యాయంగా మెలిగారని రమణయ్య సేవలను ప్రశంసించారు. అనంతరం రమణయ్య దంపతులను డిడి వేణుగోపాల్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పిఆర్‌వో రవికుమార్, ఏవి ఎస్ శివరాం ప్రసాద్, పిఆర్‌వో వినోద్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ షేక్ నాయబ్, జూనియర్ అకౌంటెంట్ భవాని, రికార్డు అసిస్టెంట్ శోభన్ బాబు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## వినుకొండ విశ్వ సాయి జూనియర్ కళాశాల - విజయభేరి!

వినుకొండ సింధూరదర్శిని:2026 ఏపీ ఈఏపీసెట్ (AP EAPCET) ఇంజనీరింగ్ మరియు మెడికల్ ఫలితాలలో వినుకొండ పట్టణంలోని విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు విజయభేరీ మ్రోగించారని కళాశాల డైరెక్టర్ వల్లి శ్రీనివాస శర్మ తెలిపారు. ఈ మేరకు ఫలితాల వివరాలను ఆయన గురువారం విడుదల చేశారు. తమ కళాశాల కు చెందిన 11 మంది విద్యార్థులు 1000 లోపు కేటగిరి ర్యాంకులు సాధించిన వారిలో తలారి తేజశ్రీ 27,. షేక్ ఫాతిమా జహీరా 135, షేక్ బాషా 180, జొన్నలగడ్డ సుప్రియ 266, కంభంపాటి విద్యాన్ రాజ్ 296,షేక్ ఆబీద 489,సౌదాగర్ మహమ్మద్ ఆసిఫ్ 685, పట్టా ఫాతిమా 744, భూక్య బబ్లూ నాయక్ 792, బూదాటి మహేష్ 929, మక్కెన మహేష్ కుమార్ 958 ఉన్నారన్నారు. అలాగే 5000 లోపు 38 మంది, పదివేల లోపు 50 మంది, 45 వేల లోపు 75 మంది, ర్యాంకులు సాధించారని అలాగే స్టేట్ ర్యాంకులు 25,000 లోపు 10 మంది,
50,000 లోపు 29 మంది, ర్యాంకులు సాధించారని తెలియ చేశారు.
స్టేట్ టాప్ ర్యాంకర్లు సాధించిన వారిలో...
అడ్డగిరి వెంకట జాహ్నవి – (11,102), షేక్ బాషా –( 12,80)
చీమకుర్తి ఖాదర్ బాబా అక్షయ –( 12,813),
పఠాన్ హుమ్రా – (19,166),
చుట్టూరి వెంకట త్రివేణి – (10640),
షేక్ ఫాతిమా జహీరా – (22,35,
షికా అభిషేక్ – (22,992),. చింతలచెరువు సృజన – (23,123),
గర్రె అమృత వర్షిని – (24,394)
పఠాన్ సుఫియా అబ్జా – (25,028) ఉన్నారని ఆయన తెలిపారు.
ఈ ర్యాంకులు సాధించేందుకు కృషిచేసిన అధ్యాపక బృందానికి మరియు మమ్మల్ని ప్రోత్సహించిన విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు మరియు విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

## బస్సు కోసం విద్యార్థుల ఆందోళన




వినుకొండ– సింధూరదర్శిని: వినుకొండ నియోజకవర్గంలోని బొల్లాపల్లి మండలం పరిధిలో గల జయంతి రామాపురం గ్రామ విద్యార్థులు గత కొంతకాలంగా ఆర్టీసీ బస్సు సంబంధించి సమస్యలు ఎదుర్కొంటున్నారు రోజు పాఠశాలకు వెళ్లాలంటే వారికి బస్సు తప్ప మరో మార్గం లేదు. తమ గ్రామం మీదుగా వినుకొండకు వెళ్లే బస్సు ఆపకుండా వెళ్తూ ఉండటంతో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు బస్సు ఆగితే స్కూల్ కి వెళ్లడం లేకుంటే లేదు దీంతో వారానికి రెండు మూడు రోజులు పాఠశాలకు తప్పడం లేదు ఈ విషయమై ఆర్టీసీ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టిన ఆలకించలేదు దీంతో విసిగి చెందిన విద్యార్థులు గురువారం గ్రామ ప్రధాన రహదారిపై ట్రాక్టర్లను అడ్డుగా నిలిపి తల్లిదండ్రులతో పాటు విద్యార్థిని విద్యార్థులు ఆందోళనకు దిగారు తమ గ్రామంలో బస్సు ఆపుతామని గట్టిగా హామీ ఇస్తే తప్ప కదిలేది లేదని భీష్మించారు సమాచారం అందుకున్న వినుకొండ డిపో ఆర్టీసీ అధికారులు ద్వారా గ్రామస్తులతో మాట్లాడుతూ ప్రతిరోజు తప్పకుండా బస్సు నిలుపుదల చేస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన నిర్వహించారు.

## పేద ప్రజల ఆరోగ్య సంజీవని ముఖ్యమంత్రి సహాయనిధి : ఆనందబాబు



చుండూరు/భట్టిప్రోలు సింధూరదర్శిని:అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఏర్పాటు చేయడం జరిగిందని అది ఎందరికో సంజీవనిలా ఉపయోగపడుతుందని వేమూరు నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. చుండూరు మండలం యడ్లపల్లి గ్రామానికి చెందిన ముసునూరు శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యం చెంది ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది ఉన్నారు. ముసునూరు శ్రీనివాస్ వైద్యం బిల్లులను శాసనసభ్యులు నక్కా ఆనంద బాబుకు తెలియ జేయడం జరిగింది. తక్షణమే స్పందించిన ఆనందబాబు ప్రత్యేక సిఫార్సు లేఖతో ముఖ్యమంత్రి సహాయనిధి కార్యాలయానికి పంపించటం జరిగింది. వాటిని పరిశీలించిన ప్రభుత్వం అర్హత మేరకు రూ.7.20లక్షల వైద్య సహాయాన్ని మంజూరు చేసింది. ఈసందర్భంగా మంజూరైన రూ.7.20లక్షల చెక్కును ఆనందబాబు లబ్ధిదారుడు శ్రీనివాస్‌కు గురువారం ఆయన కార్యాలయంలో స్వయంగా లబ్ధిదారునికి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తోందన్నారు. వేమూరు నియోజకవర్గంలో అర్హులైన ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. లబ్ధిదారుడు ముసునూరు శ్రీనివాస్ తమకు వైద్య సహాయం మంజూరు చేయడంలో సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ప్రత్యేక చొరవ తీసుకుని సిఫార్సు చేసిన వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనంద బాబుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.





# అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్లు, కుక్కర్ల పంపిణీ చేసిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

వినుకొండ – సింధూరదర్శిని:
వినుకొండ పట్టణం జాషువా కళా ప్రాంగణం నందు గురువారం గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించి, ‘ఆరోగ్య ఆంధ్రప్రదేశ్’ సాధించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ చీఫ్ విప్, శ్రీ జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. వినుకొండ నియోజకవర్గంలోని అంగన్వాడీ కేంద్రాలకు ఆధునిక వంట సామగ్రి (ఇండక్షన్ స్టవ్లు, కుక్కర్లు) పంపిణీ చేసే కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు.
జీవీ మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్వాడీ కేంద్రాలు ఎంతో ఆదర్శవంతంగా నడుస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు.డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు కూటమి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పిడుగురాళ్లలో ఘనంగా అంతర్జాతీయ డాక్టర్స్ దినోత్సవ వేడుకలు

**జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఘనంగా “డాక్టర్ ఆఫ్ డిస్టింక్షన్” అవార్డుల ప్రదానోత్సవం**
**IMA పిడుగురాళ్ల బ్రాంచ్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహణ – AMS పిడుగురాళ్ల బ్రాంచ్ ప్రారంభం**



మాచవరం జులై 2 సింధూరదర్శిని: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిడుగురాళ్ల బ్రాంచ్ ఆధ్వర్యంలో భవనాసి కళ్యాణ మండపంలో “డాక్టర్ ఆఫ్ డిస్టింక్షన్” అవార్డుల ప్రదానోత్సవం, నిరంతర వైద్య విద్య (జవీజు) కార్యక్రమం మరియు IMA అకాడమీ ఆఫ్ మెడికల్ స్పెషాలిటీస్ పిడుగురాళ్ల బ్రాంచ్ ప్రారంభోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. కార్యక్రమం ప్రారంభంలో భారతరత్న డా. బి.సి. రాయ్ చిత్రపటానికి ముఖ్య అతిథి డా. సి. సాయిరాం , ఐఎంఏ పిడుగురాళ్ల బ్రాంచ్ అధ్యక్షులు డా. ధూళిపాళ్ల భరత్ కుమార్, అవార్డు గ్రహీతలు మరియు ఇతర ప్రముఖులు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డా. సి. సాయిరాంకి పూర్ణకుంభ స్వాగతం, వేద మంత్రోచ్ఛరణలు, వేద ఆశీర్వచనం, సన్నాయి మేళాల నడుమ ఘన స్వాగతం పలికారు. అనంతరం డా. ధూళిపాళ్ల భరత్ కుమార్ సభకు స్వాగతం పలికారు. ముఖ్య అతిథి డా. సి. సాయిరాం మాట్లాడుతూ IMA Academy of Medical Specialities (AMS) ప్రాముఖ్యత, స్పెషలిస్ట్ వైద్యులకు అందించే అకాడమిక్ అవకాశాలు, క్లినికల్ ట్రైనింగ్ మరియు నిరంతర వైద్య విద్య ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆయన మార్గనిర్దేశకత్వంలో ఐఎంఏ పిడుగురాళ్ల బ్రాంచ్ విశేష కృషి చేసి 21 మంది స్పెషలిస్టులను ూమీ జీవిత సభ్యులుగా చేర్చి, స్వల్పకాలంలోనే ూమీ పిడుగురాళ్ల బ్రాంచ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో కూడా బ్రాంచ్ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. అనంతరం డా. సి. సాయిరాం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. తదుపరి AMSలో కొత్తగా చేరిన 21 మంది సభ్యులకు సభ్యత్వ ధృవపత్రాలను అందజేసి IMA AMS పిడుగురాళ్ల బ్రాంచ్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ క్లినికల్ మరియు ప్రివెంటివ్ ఆంకాలజిస్ట్, ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్, హైదరాబాద్‌లో ప్రొఫెసర్ మరియు విభాగాధిపతిగా విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన, ప్రస్తుతం IMA AMS హెడ్‌క్వార్టర్స్ గౌరవ జాతీయ కార్యదర్శిగా సేవలందిస్తున్న డా. సి.సాయిరాంని ఘనంగా సన్మానించి “డాక్టర్ ఆఫ్ డిస్టింక్షన్” అవార్డుతో గౌరవించారు. అనంతరం డాక్టర్ ఆఫ్ డిస్టింక్షన్ – 2026 అవార్డులకు ఎంపికైన ఐఎంఏ పిడుగురాళ్ల బ్రాంచ్ సీనియర్ సభ్యులు డా. మందపాటి కోటిరెడ్డి మరియు డా. కనుమూరి క్రాంతి కుమార్ ని వారి సతీమణులతో కలిసి ఘనంగా సత్కరించి అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారి విశిష్ట వైద్య సేవలను సభలో కొనియాడారు. ఈ కార్యక్రమానికి ఆదిత్య మెడికేర్ హాస్పిటల్, గుంటూరు యాజమాన్యం ప్రధాన సహకారాన్ని అందించింది. ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డా. కృష్ణ శ్రవంత్ గారు, డా. ఆకిఫ్, డా. పవన్, డా. జ్యోతి, డా. శ్రీష్ కుమార్, డా. అమూల్య పాల్గొని నిర్వహించిన నిరంతర వైద్య విద్య కార్యక్రమంలో శాస్త్రీయ ఉపన్యాసాలు అందించారు. వైద్య విద్యా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు ముఖ్యఅతిథి డా. సి.సాయిరాం చేతుల మీదుగా అధ్యాపకులందరికీ ప్రశంసాపత్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమాన్ని IMA పిడుగురాళ్ల బ్రాంచ్ అధ్యక్షులు డా. ధూళిపాళ్ల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. గత రెండు సంవత్సరాల్లో బ్రాంచ్ సాధించిన విశేష అభివృద్ధిని పలువురు ప్రముఖులు ప్రశంసించారు. ముఖ్యంగా డా. సి. సాయిరాం మార్గనిర్దేశకత్వంలో AMS పిడుగురాళ్ల బ్రాంచ్‌ను విజయవంతంగా ఏర్పాటు చేయడంలో డా. ధూళిపాళ్ల భరత్ కుమార్ చేసిన కృషిని కొనియాడారు. స్వల్ప కాలంలో పిడుగురాళ్ల బ్రాంచ్ రాష్ట్రంలో ఆదర్శ శాఖగా ఎదగడం అభినందనీయమని ముఖ్య అతిథి ప్రశంసిస్తూ, పిడుగురాళ్ల బ్రాంచ్‌ను సందర్శించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వంద మందికి పైగా వైద్యులు, వారి కుటుంబ సభ్యులు, ఐఎంఏ సభ్యులు, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, స్పాన్సర్లు, వాలంటీర్లు, మీడియా ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పార్క్ పహరి గోడకు శంకుస్థాపన నిర్వహించిన ఎమ్మెల్యే శ్రీనివాసరావు

మాచవరం సింధూరదర్శిని: పల్నాడు జిల్లా, గురజాల నియోజకవర్గం, పిడుగురాళ్ల పట్టణం, యరపతినేని నగర్ లోని పార్క్ చుట్టూ నూతనంగా నిర్మించనున్న ప్రహరీ గోడ శంకుస్థాపన కార్యక్రమంలో గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షేక్ ఆధామ్ షఫీ , మున్సిపల్ కమిషనర్ ఇరువురి శ్రీనివాసులు పిడుగురాళ్ల తహసిల్దార్ మధుబాబు , పిడుగురాళ్ల మున్సిపాల్ ఏఈ యరమాల రోహిణి మరియు కూటమి నాయకులు పాల్గొని ప్రహరీ గోడకు శంకుస్థాపన చెయ్యటం జరిగింది.



# అమర్‌నాథ్ యాత్ర.. తొలి బృందానికి చందర్‌కోట్‌లో ఘన స్వాగతం

**బల్తాల్ మార్గ యాత్రికులను ఆహ్వానించిన అధికారులు, పౌర సమాజం**

**భద్రత, వసతులపై విస్తృత ఏర్పాట్లు చేసిన జమ్మూకశ్మీర్ యంత్రాంగం**

**రేపటి నుంచి ప్రారంభమై 57 రోజుల పాటు కొనసాగనున్న పవిత్ర యాత్ర**



ఇప్పటికే 3.5 లక్షల మందికి పైగా భక్తుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ అమర్‌నాథ్ యాత్రకు సర్వం సిద్ధమైంది. ఈ యాత్రలో భాగంగా బల్తాల్ మార్గంలో బయల్దేరిన తొలి బృందం యాత్రికులకు నేడు ఘన స్వాగతం లభించింది. జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిపై ఉన్న రాంబన్ జిల్లాలోని చందర్‌కోట్ వద్ద ఏర్పాటు చేసిన లంగర్ (ఉచిత భోజనశాల) వద్ద అధికారులు, స్థానికులు యాత్రికులను సాదరంగా ఆహ్వానించారు. రాంబన్ జిల్లా యంత్రాంగం, పౌర సమాజ ప్రతినిధులు, పలు లంగర్ సంస్థలు కలిసి యాత్రికులకు శుభాకాంక్షలు తెలిపి, వారి యాత్ర ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఐజీ (డీకేఆర్ రేంజ్) సర్గున్ శుక్లా, రాంబన్ డిప్యూటీ కమిషనర్ మహ్మద్ అలియాస్ ఖాన్, ఎస్ఎస్పీ అరుణ్ గుప్తా, ఎస్ఎస్పీ ట్రాఫిక్ రాజా ఆదిల్ హమీద్‌తో పాటు పలువురు సీనియర్ సివిల్, పోలీసు అధికారులు పాల్గొన్నారు. జమ్మూలోని భగవతి నగర్ బేస్ క్యాంప్ నుంచి లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా గురువారం ఉదయం యాత్రికుల కాన్వాయ్‌ను జెండా ఊపి ప్రారంభించిన తర్వాత, చందర్‌కోట్ వారికి మొదటి ప్రధాన విరామ కేంద్రంగా నిలిచింది. యాత్రికులకు ఆహారం, తాగునీరు, ఇతర అత్యవసర సేవలు అందించేందుకు ఇక్కడ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. యాత్రికుల భద్రత, సంక్షేమం, ప్రయాణం సాఫీగా సాగేందుకు జిల్లా యంత్రాంగం విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. పోలీసు, ఆర్మీ, సీఏపీఎఫ్, ట్రాఫిక్ పోలీసు, ఆరోగ్య శాఖ, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక సేవలు వంటి ఇతర ఏజెన్సీలతో సమన్వయం చేసుకుంటూ పటిష్ఠమైన చర్యలు తీసుకుంది. రాంబన్ జిల్లాకు ఉన్న ఆతిథ్య సంప్రదాయానికి ఈ స్వాగత కార్యక్రమం అద్దం పడుతోంది. దేశవ్యాప్తంగా తరలివచ్చే భక్తులకు ఈ వార్షిక యాత్రను ఒక మధురమైన అనుభూతిగా మార్చడంలో భాగస్వాములందరి సమష్టి నిబద్ధతను ఇది తెలియజేస్తోంది.

**యాత్ర నేపథ్యం.. వివరాలు**

భారతదేశంలోని అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్ర యాత్రలలో శ్రీ అమర్‌నాథ్ యాత్ర ఒకటి. ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు దక్షిణ కశ్మీర్‌లోని హిమాలయాల్లో సుమారు 3,880 మీటర్ల ఎత్తులో ఉన్న అమర్‌నాథ్ గుహను సందర్శిస్తారు. ఇక్కడ సహజంగా ఏర్పడిన మంచు శివలింగాన్ని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఈ మంచు లింగం శివుని ప్రతీకగా భక్తులు భావిస్తారు. ఈ ఏడాది 57 రోజుల పాటు కొనసాగే ఈ యాత్ర జులై 3న అధికారికంగా ప్రారంభమై, రక్షా బంధన్ పర్వదినం రోజున అంటే ఆగస్టు 28న ముగుస్తుంది. అనంతనాగ్ జిల్లాలోని సంప్రదాయ 48 కిలోమీటర్ల నున్వాన్-పహల్గామ్ మార్గం, అలాగే గందర్‌బల్ జిల్లాలోని తక్కువ దూరంతో నిటారుగా ఉండే 14 కిలోమీటర్ల బల్తాల్ మార్గం ద్వారా ఏకకాలంలో యాత్ర కొనసాగుతుంది. యాత్రను విజయవంతంగా నిర్వహించేందుకు జమ్మూకశ్మీర్ వ్యాప్తంగా ఆన్‌స్పాట్ రిజిస్ట్రేషన్, ఆర్ఎఫ్ఐడీ కార్డుల జారీ, పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు, మౌలిక సదుపాయాల మెరుగుదల వంటి పనులను పూర్తి చేశారు. నివేదికల ప్రకారం, ఈ యాత్ర కోసం ఇప్పటివరకు 3.5 లక్షల మందికి పైగా భక్తులు నమోదు చేసుకున్నారు. రద్దీని నియంత్రించేందుకు రోజువారీ యాత్రికుల సంఖ్యపై పరిమితులు విధించారు.

## చికెన్, గుడ్ల ధరలకు రెక్కలు.. సామాన్యుడి జేబుకు చిల్లు!


**-ఒక్కసారిగా పెరిగిన చికెన్, కోడి గుడ్ల ధరలు**

**-హైదరాబాద్, విజయవాడలో కిలో చికెన్ రూ.330**

**-ఒక్క గుడ్డు ధర రూ.8కు చేరగా, ట్రే రూ.240**

**-ఎండలు, దాణా ధరల పెరుగుదలతో తగ్గిన ఉత్పత్తి**


**-డిమాండ్ పెరగడంతో మరింత ఎగబాకుతున్న ధరలు**



ఒకప్పుడు సామాన్యుడికి అందుబాటులో ఉన్న చికెన్, కోడిగుడ్లు ఇప్పుడు జేబుకు భారంగా మారుతున్నాయి. గత కొన్ని వారాల్లోనే వీటి ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. దీంతో మధ్యతరగతి కుటుంబాలు, నాన్‌వెజ్ ప్రియులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా వారాంతంలో చికెన్ కొనాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెలుగు రాష్ట్రాల్లో గత వారం వరకు కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ.280 నుంచి రూ.300మధ్య విక్రయించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రాంతాన్ని బట్టి రూ.300 నుంచి రూ.330 వరకు పలుకుతోంది. విజయవాడలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అక్కడ కూడా కిలో చికెన్ రూ.320 నుంచి రూ.330 వరకు అమ్ముతున్నారు. కొన్ని రిటైల్ దుకాణాల్లో ధరలు ఇంకా ఎక్కువగా ఉన్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. చికెన్‌తో పాటు కోడిగుడ్ల ధరలు కూడా పెరిగాయి. నెల రోజుల క్రితం రూ.6 నుంచి రూ.7 మధ్య ఉన్న ఒక్క గుడ్డు ధర ప్రస్తుతం రూ.8కు చేరింది. దీంతో 30 గుడ్ల ట్రే కొనాలంటే దాదాపు రూ.240 ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రొటీన్ కోసం గుడ్లపై ఆధారపడే కుటుంబాలకు ఇది అదనపు భారంగా మారింది. ఈధరల పెరుగుదలకు పలు కారణాలు కనిపిస్తున్నాయి. ఎండల తీవ్రతతో పౌల్ట్రీ ఫారాల్లో కోళ్ల మరణాలు పెరగడం వల్ల ఉత్పత్తి తగ్గింది. మరోవైపు మొక్కజొన్న, సోయాబీన్ వంటి దాణా ధరలు పెరగడంతో పౌల్ట్రీ నిర్వహణ వ్యయం కూడా పెరిగింది. దీంతో చాలామంది రైతులు కోళ్ల పెంపకాన్ని తగ్గించినట్లు వ్యాపారులు చెబుతున్నారు. పెళ్లిళ్లు, శుభకార్యాల సీజన్ కావడంతో హోటళ్లు, ఫంక్షన్ హాళ్ల నుంచి డిమాండ్ భారీగా పెరిగింది. సరఫరా తగ్గి, డిమాండ్ పెరగడంతో ధరలు మరింత ఎగబాకుతున్నాయి. ఇప్పటికే నిత్యావసర వస్తువులు, వంటనూనెల ధరలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఇప్పుడు చికెన్,గుడ్ల ధరల పెరుగుదల మరోభారం అయింది.

## శ్రీవారి సేవలో మంత్రి లోకేశ్ ప్రత్యేక పూజలు

ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం ఉదయం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా ఆలయంలోకి చేరుకున్న ఆయనకు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి లోకేశ్ తిరుప్పావడ సేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేశారు. శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్‌రెడ్డి, పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, తిరుపతి జిల్లా టీడీపీ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్మన్ సుగుణమ్మ, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# శివాజీకి అత్యంత ప్రియమైన కోట.. 'లోహగఢ్' రహస్యమేంటి?

'లోహ్‌గఢ్' అంటే 'ఇనుప కోట' అని అర్థం – ఇనుప ఖనిజం అధికంగా ఉన్న కొండపై ఈ కోట నిర్మాణం

వెయ్యేళ్లుగా ఎన్నో రాజవంశాల పాలనను తట్టుకుని నిలిచింది – శివాజీ మహారాజు రెండుసార్లు ఈ కోటను స్వాధీనం చేసుకున్నారు

'వించూ కాటా' (తేలు తోక) ఈ కోటలోని ప్రత్యేక ఆకర్షణ



మహారాష్ట్రలోని పుణే సమీపంలో ఉన్న లోహ్‌గఢ్ కోట దురదృష్టవశాత్తూ యువ రియల్టర్ కేతన్ అగర్వాల్ హత్య కేసుతో తాజాగా వార్తల్లో నిలిచింది. నిజానికి ఈ కోట శతాబ్దాల చరిత్రకు సాక్షిగా నిలుస్తోంది. ఎన్నో రాజవంశాల పాలన, యుద్ధాలు, దండయాత్రలను తట్టుకుని చెక్కుచెదరకుండా నిలిచిన ఈ కోటను 'ఇనుప కోట'గా పిలుస్తారు. అయితే ఆ పేరు కోటను ఇనుముతో నిర్మించినందుకే కాదు. ప్రకృతి, చరిత్ర, అద్భుతమైన నిర్మాణ నైపుణ్యాల కలయికే దీనికి ఆ ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది.

**'లోహ్‌గఢ్' పేరు వెనుక కథ**

'లోహ' అంటే ఇనుము. 'గఢ్' అంటే కోట. ఈ రెండు పదాలు కలిసి 'లోహ్‌గఢ్'గా మారాయి. సముద్ర మట్టానికి 1,033 మీటర్ల ఎత్తులో సహ్యాద్రి పర్వత శ్రేణిలో ఉన్న ఈ కోట ఇనుప ఖనిజం అధికంగా ఉన్న రాతి కొండపై నిర్మించారు. బలమైన సహజ పునాది కారణంగా ఈ కోటపై దాడి చేయడం శత్రువులకు చాలా కష్టంగా ఉండేది. అందుకే కాలక్రమంలో దీనిని 'ఇనుప కోట'గా పిలవడం ప్రారంభించారు.

**ఎన్నో రాజవంశాలకు సాక్ష్యం**

లోహ్‌గఢ్ కోటకు వెయ్యేళ్లకుపైగా చరిత్ర ఉంది. శాతవాహనులు, చాళుక్యులు, రాష్ట్రకూటులు, యాదవులు, బహమనీ సుల్తానులు, నిజాంలు, మొఘలులు, మరాఠాలు ఇలా అనేక రాజవంశాలు ఈ కోట నుంచి పాలించాయి. పాలకులు మారినా కోట మాత్రం చెక్కుచెదరలేదు. యుద్ధాలు, ప్రకృతి వైపరీత్యాలు, రాజకీయ మార్పులను తట్టుకుని నిలిచిన ఈ కోట నిజంగానే తన పేరుకు తగ్గట్టే ఇనుప సంకల్పానికి ప్రతీకగా నిలిచింది.


**శివాజీకి అత్యంత ప్రియమైన కోట**

ఛత్రపతి శివాజీ మహారాజు 1648లో ఈ కోటను స్వాధీనం చేసుకున్నారు. 1665లో పురందర్ ఒప్పందం తర్వాత మొఘలులకు అప్పగించాల్సి వచ్చినా 1670లో తిరిగి తన అధీనంలోకి తెచ్చుకున్నారు. సూరత్ యాత్రలో సంపాదించిన సంపదలో పెద్ద భాగాన్ని శివాజీ ఈ కోటలోనే భద్రపరిచినట్లు చరిత్ర చెబుతోంది. కిలోమీటర్‌కు పైగా విస్తరించిన బలమైన ప్రహరీ గోడలు ఇప్పటికీ పర్యాటకులను ఆశ్చర్యపరుస్తుంటాయి.

**ప్రత్యేక ఆకర్షణ 'వించూ కాటా'**

లోహ్‌గఢ్ కోటలో అత్యంత ప్రత్యేకమైన భాగం 'వించూ కాటా'. మరాఠీలో దీనికి 'తేలు తోక' అనే అర్థం. కోట నుంచి బయటకు పొడుచుకొచ్చిన ఈ రాతి నిర్మాణంపై నుంచి చూస్తే తేలు తోకలా కనిపిస్తుంది. ఇది శత్రువుల కదలికలను ముందుగానే గమనించేందుకు సైనికులకు ఉపయోగపడేది. నేడు ఇదే లోహ్‌గఢ్ కోటకు ప్రధాన ఆకర్షణగా మారింది.

# వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ అజివికా మిషన్ ప్రారంభం



ఒంటిమిట్ట సింధూరదర్శిని:

రాజంపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు ఆదేశాల మేరకు రాజంపేట నియోజకవర్గంలోని ఒంటిమిట్ట మండలం గంగ పేరూరు చిన్న చెరువులో గురువారం వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ అజివికా మిషన్‌ను కార్యక్రమాన్ని ఒంటిమిట్ట ఏపీవో మరియు మండల టిడిపి నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా బొబ్బిలి రాయుడు మాట్లాడుతూ, మన దేశాన్ని 2047 నాటికి ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మహత్తర సంకల్పం "వికసిత్ భారత్-2047"కు గ్రామాలే బలమైన పునాది అని అన్నారు. ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వికసిత్ భారత్ గ్రామ అభియాన్ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా ప్రారంభం కావడం చాలా సంతోషం అని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి పాలనలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజా నిబద్ధతతో, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ బాబు అభివృద్ధి దృక్పథంతో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో గ్రామీణాభివృద్ధికి కొత్త దిశను చూపిస్తున్నాయని అన్నారు. గ్రామాల్లో తాగునీటి సదుపాయాల మెరుగుదల, నాణ్యమైన రహదారుల నిర్మాణం, పరిశుభ్రత, విద్యుత్ సౌకర్యాల విస్తరణ, నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు, రైతులకు ప్రభుత్వ పథకాల సమర్థవంతమైన అమలు, మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతం, యువతకు ఉపాధి--నైపుణ్య అవకాశాల కల్పన, డిజిటల్ సేవలను గ్రామస్థాయికి విస్తరించడం, ప్రతి అర్హ కుటుంబానికి కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలని వివరించారు. గ్రామాలు బలపడితేనే రాష్ట్రం బలపడుతుంది... రాష్ట్రం బలపడితేనే వికసిత్ భారత్ లక్ష్యం సాకారమవుతుంది" అని పేర్కొంటూ, ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శివ శంకర్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు బొబ్బిలి రాయుడు, కట్టా సుబ్బరాయుడు, రాజనాల రమేష్, ,చంద్రారెడ్డి ప్రజా ప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, సంఖ్యలో పాల్గొన్నారు.

# 8వ వేతన సంఘానికి ఉద్యోగ సంఘాల డిమాండ్.. భారీగా పెరగనున్న కనీస వేతనం?

8వ వేతన సంఘంపై పెరుగుతున్న అంచనాలు - కనీస వేతనాన్ని రూ.18,000 నుంచి భారీగా పెంచాలని డిమాండ్

రూ.55,000 నుంచి రూ.69,000 వరకు ఉద్యోగ సంఘాల ప్రతిపాదనలు

కుటుంబ యూనిట్లు, ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ ఆధారంగా వేర్వేరు లెక్కలు - ఉద్యోగుల ఆకాంక్షలు, ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి మధ్య సవాలు

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం 8వ వేతన సంఘం (శ్రీష్ట్ర ౹ఖిఎ జశీఎఎంఅంఱశీఅ) ఏర్పాటుపై చర్చలు ఊపందుకున్న వేళ, ఉద్యోగ సంఘాలు తమ డిమాండ్లను బలంగా వినిపిస్తున్నాయి. జీతాల పెంపు, ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్, కరవు భత్యం (డీఏ) విలీనం వంటి అంశాలు చర్చల్లో ఉన్నప్పటికీ, అందరి దృష్టి ఇప్పుడు ఒకే ఒక్క ప్రశ్నపై కేంద్రీకృతమై ఉంది: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి కనీస మూల వేతనం (వీఱఅఱఎబఎ దీ఑ంఱష ఞఖీఞతీఎ) ఎంత ఉండాలి?

దాదాపు దశాబ్దం క్రితం 7వ వేతన సంఘం సిఫార్సుల మేరకు నిర్ణయించిన రూ.18,000 కనీస వేతనం, ప్రస్తుత జీవన వ్యయానికి ఏమాత్రం సరిపోవడం లేదని ఉద్యోగ సంఘాలు వాదిస్తున్నాయి. పెరిగిన ద్రవ్యోల్బణం, విద్య, వైద్య ఖర్చులు, నిత్యావసరాల ధరలు, కుటుంబ బాధ్యతల నేపథ్యంలో కనీస వేతనాన్ని భారీగా సవరించాలని కోరుతున్నాయి. ఈ క్రమంలో కొన్ని సంఘాలు కనీస వేతనాన్ని రూ.55,000కు పెంచాలని ప్రతిపాదిస్తుండగా, మరికొన్ని సంఘాలు ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను ఆధారంగా చేసుకుని ఏకంగా రూ.69,000 వరకు ఉండాలని డిమాండ్ చేస్తున్నాయి.

### రూ.18,000 ఎందుకు సరిపోదంటున్నారు?

2016లో 7వ పే కమిషన్ అమలులోకి వచ్చినప్పుడు కనీస వేతనాన్ని రూ.7,000 నుంచి రూ.18,000కు పెంచారు. అప్పుడు 2.57 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను వర్తింపజేశారు. అయితే, గడిచిన పదేళ్లలో ఆర్థిక పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు వచ్చాయని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. ఆహారం, రవాణా, గృహ అద్దెలు, పిల్లల చదువులు వంటి అన్ని ఖర్చులూ పెరిగాయని, ఉద్యోగుల కొనుగోలు శక్తి తగ్గిపోయిందని వారు వివరిస్తున్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని భర్తీ చేయడానికి ఇచ్చే డీఏ కూడా భారీగా పెరగడమే ఇందుకు నిదర్శనమని పేర్కొంటున్నారు. అందువల్ల,



2026 తర్వాత ఉద్యోగికి సరైన కనీసవేతనాన్ని పునర్నిర్వచించాల్సిన అవసరం ఉందని వారు స్పష్టం చేస్తున్నారు.

### రూ.55,000డిమాండ్ వెనుకశాస్త్రీయ కారణాలు

అఖిల భారత ఎన్‌పీఎస్ ఉద్యోగుల సమాఖ్య (ఏఐఎన్‌పీఎస్‌ఈఎఫ్) కనీస వేతనం పెంపునకు బలమైన శాస్త్రీయ కారణాలను తన నివేదికలో పొందుపరిచింది. 7వ పే కమిషన్ ముగ్గురు సభ్యులున్న కుటుంబాన్ని (ఉద్యోగి, జీవిత భాగస్వామి, పిల్లలు) ఒక యూనిట్‌గా పరిగణించిందని, కానీ నేటి పరిస్థితుల్లో ఉద్యోగిపై ఆధారపడిన తల్లిదండ్రులు కూడా ఉంటున్నారని పేర్కొంది. అందువల్ల, కుటుంబ యూనిట్‌ను 3 నుంచి 5కు పెంచి లెక్కించాలని సూచించింది.

'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్' (ఐసీఎంఆర్) ప్రకారం పనిచేసే వయోజనుడికి రోజుకు 3,490 కేలరీల శక్తి అవసరమని, ఈ పౌష్టికాహారాన్ని అందించేందుకు అయ్యే ఖర్చు గత కొన్నేళ్లలో 20-25% పెరిగిందని ఏఐఎన్‌పీఎస్‌ఈఎఫ్ వివరించింది. ఈ పెరిగిన ఖర్చు, 5-యూనిట్ల కుటుంబ నమూనా, డీఏ విలీనం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటే కనీస వేతనం రూ.55,000 నుంచి రూ.60,000 మధ్య ఉండాలని అంచనా వేసింది. అందుకే కనీస వేతనాన్ని రూ.55,000గా నిర్ణయించాలని సిఫార్సు చేసింది.

### రూ.69,000 ప్రతిపాదనకు ఆధారం ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్

మరికొన్ని ఉద్యోగ సంఘాలు ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను ప్రధానంగా ప్రస్తావిస్తున్నాయి. 7వ పే కమిషన్ ఉపయోగించిన 2.57 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ స్థానంలో, 8వ పే కమిషన్ 3.83 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను సిఫార్సు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఒకవేళ ఈ ప్రతిపాదనను అంగీకరిస్తే, ప్రస్తుత కనీస వేతనం రూ.18,000కు 3.83రెట్లు పెరిగి, సుమారు రూ.69,000 అవుతుంది. బ్యాంక్‌బజార్ సీఈఓ అధిల్ శెట్టి మాట్లాడుతూ, "ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌పైనే అందరి దృష్టి ఉంది, ఎందుకంటే ఇది ప్రస్తుతజీతాలు, పెన్షన్ల సవరణను నిర్ణయిస్తుంది. ఉద్యోగ సంఘాలు 3.83 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను ప్రతిపాదించాయి.అయితే ఇదికేవలం డిమాండ్ మాత్రమే" అని 'ఇండియాటుడే.ఇన్'తో అన్నారు.

### కమిషన్ ముందున్న సవాళ్లు

8వ వేతన సంఘం ఏఒక్క ప్రతిపాదననూ యథాతథంగా ఆమోదించే అవకాశం లేదు. ద్రవ్యోల్బణ పోకడలు, వినియోగదారుల ఖర్చు సరళి, ప్రభుత్వ ఆర్థిక స్థిరత్వం, ఖజానాపై పడే భారం వంటి అనేక అంశాలను కమిషన్ బేరీజు వేయాల్సి ఉంటుంది. సుమారు 55 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 69 లక్షల మంది పెన్షనర్ల ఆకాంక్షలను, దేశ ఆర్థిక వాస్తవాలను సమన్వయం చేయడం కమిషన్‌కు అతిపెద్ద సవాలుగా మారనుంది. ప్రస్తుతం ఉద్యోగ సంఘాలు, వివిధ భాగస్వామ్య పక్షాలతో కమిషన్ సంప్రదింపులు జరుపుతోంది. ఈ చర్చల తర్వాతే తుది సిఫార్సులను ప్రభుత్వానికి సమర్పించనుంది. కనీస వేతనం రూ.55,000 అవుతుందా, రూ.69,000కు చేరుకుంటుందా? లేదా మధ్యేమార్గంగా మరో సంఖ్యను నిర్ణయిస్తారా? అనేది వేచి చూడాలి.



## అంటార్కిటికాలో 'రక్త జలపాతం'..

ఎరుపు రంగు వెనక అసలు కథ ఇదే!

అంటార్కిటికాలోని 'బ్లడ్ ఫాల్స్'పై వందేళ్లుగా మిస్టరీ

ఇనుము అధికంగా ఉన్న ఉప్పునీరు గాలితో

చర్య జరపడం వల్లే ఎరుపు రంగు

ఈ నీటి మూలం గ్లేసియర్ కింద 15 లక్షల

ఏళ్ల నాటి పురాతన సరస్సు

గ్లేసియర్‌లోని పగుళ్లు, రహస్య మార్గాల గుండా నీరు పైకి

మంచు కింద లక్షల ఏళ్లుగా సూక్ష్మజీవులు జీవిస్తున్న వైనం

ప్రపంచంలోనే అత్యంత చల్లని ఖండమైన అంటార్కిటికాలో ఓ జలపాతం రక్తంలా ఎర్రగా ప్రవహిస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. దాన్ని చూసినవారికి నిజంగానే మంచు కొండల నుంచి రక్తం కారుతున్నట్టే అనిపిస్తుంది. అయితే అది రక్తం కాదు. శతాబ్దకాలంగా శాస్త్రవేత్తలను వేధించిన ఈ రహస్యానికి తాజాగా సమాధానం లభించింది.

### అసలు రహస్యం ఇదే

అంటార్కిటికాలోని టేలర్ గ్లేసియర్ నుంచి ప్రవహించే ఈ జలపాతాన్ని 'బ్లడ్ ఫాల్స్' అని పిలుస్తారు. దీని ఎరుపు రంగుకు కారణం ఇనుము అధికంగా ఉన్న అత్యంత ఉప్పునీరు. మంచు అడుగున ఉన్న ఈ నీరు బయటకు వచ్చిన వెంటనే గాలిలోని ఆక్సిజన్‌తో ప్రతిచర్య జరిపి తుప్పు రంగులోకి మారుతుంది. అందుకే ఈ జలపాతం రక్తంలా ఎర్రగా కనిపిస్తుంది.

### 15 లక్షల ఏళ్ల నాటి సరస్సు

ఈ నీటి మూలం టేలర్ గ్లేసియర్ కింద సుమారు 400 మీటర్ల లోతులో ఉన్న పురాతన సరస్సు. దాదాపు 15 లక్షల సంవత్సరాల క్రితం సముద్రపు నీరు మంచు కింద చిక్కుకుపోయి, కాలక్రమంలో మరింత ఉప్పుగా మారిందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఉప్పు శాతం చాలా ఎక్కువగా ఉండటంతో తీవ్ర చలిలో కూడా ఈ నీరు గడ్డకట్టకుండా ద్రవరూపంలోనే ఉంటుంది.

1911లో ఆస్ట్రేలియా భూగర్భ శాస్త్రవేత్త గ్రిఫిత్ టేలర్ ఈ జలపాతాన్ని తొలిసారి గుర్తించారు. అప్పట్లో ఎరుపు రంగుకు ఆల్గే కారణమని భావించారు. కానీ తర్వాతి పరిశోధనల్లో అది తప్పని తేలింది. 2017లో అలాస్కా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు రాడార్ సాయంతో గ్లేసియర్‌లోని రహస్య మార్గాలను గుర్తించారు. ఒత్తిడికి గురైన ఉప్పునీరు ఆ మార్గాల గుండా పైకి వచ్చి బ్లడ్ ఫాల్స్‌గా బయటపడుతుందని వెల్లడించారు.

తాజాగా 'అంటార్కిటిక్ సైన్స్' జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం మరో కీలక విషయాన్ని బయటపెట్టింది. గ్లేసియర్‌లో ఏర్పడే చిన్న చిన్న పగుళ్ల ద్వారానే ఈ ఉప్పునీరు అప్పుడప్పుడు బయటకు వస్తోందని పరిశోధకులు గుర్తించారు. దీంతో శతాబ్దకాలంగా కొనసాగుతున్న ఈ ప్రకృతి రహస్యానికి మరింత స్పష్టత లభించింది.

### సూర్యకాంతి లేకుండానే జీవం

అంతకన్నా ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే ఈ ఉప్పునీటిలో సూర్యకాంతి, ఆక్సిజన్ లేకుండా లక్షల ఏళ్లుగా సూక్ష్మజీవులు జీవిస్తున్నాయి. కాంతి లేకుండానే రసాయన చర్యల ద్వారా అవి జీవిస్తుండటం శాస్త్రవేత్తలను ఆశ్చర్యపరుస్తోంది. భూమి వెలుపల మంచుతో కప్పి ఉన్న గ్రహాలు, ఉపగ్రహాలపై కూడా ఇలాంటి పరిస్థితుల్లో జీవం ఉండే అవకాశాలను అర్థం చేసుకోవడంలో ఈ పరిశోధన కీలకంగా మారుతుందని నిపుణులు చెబుతున్నారు.

## శ్రీ భూనీల సమేత వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవానికి పట్టు వస్త్రాలు

చిట్వేలి సింధూరదర్శిని: మండల కేంద్రంలోని కే.ఎస్ అగ్ర హారంలో మంగళవారం రాత్రి శ్రీ భూనిలా సమేత వెంకటేశ్వర స్వామివారి కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతొ భక్తుల నడుమ ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముందుగా రైల్వేకోడూరు నియోజకవర్గ ఇంచార్జ్, కూడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి తనయుడు యువనేత ముక్కా సాయివికాస్ రెడ్డి సతీమణి ముక్కా శిరీష స్వామి అమ్మవార్లకు సంప్రదాయబద్ధంగా పట్టు వస్త్రాలు



సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి అమ్మవార్ల ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి దివ్య కళ్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో వీక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎన్డీఏ కూటమి నాయకులు, భక్తులు, స్థానిక గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రక్తంలో చక్కెరను తగ్గించాలా?.. వాకింగ్ కాదు, ఈ సింపుల్ వ్యాయామం చేయండి!

షుగర్ నియంత్రణకు నడక కంటే తరచుగా చేసే గుంజీలు (స్క్వాట్స్) మేలంటున్న తాజా అధ్యయనం


భోజనం తర్వాత ప్రతి 45 నిమిషాలకు 10 స్క్వాట్స్ చేయడం వల్ల ఉత్తమ ఫలితాలు

ఒకేసారి 30 నిమిషాలు నడిచేదాని కంటే ఇది 40 శాతం ఎక్కువ ప్రభావవంతం

శరీరంలోని పెద్ద కండరాలను యాక్టివ్‌గా ఉంచడమే దీని వెనుక ఉన్న రహస్యం

నడక, స్క్వాట్స్ రెండింటికీ వాటి వాటి ప్రత్యేక ఆరోగ్య ప్రయోజనాలు





ఆరోగ్యంగా జీవించాలంటే రోజూ నడవాలని వైద్యులు, ఆరోగ్య నిపుణులు ఎప్పటినుంచో చెబుతున్నారు. ఎలాంటి ప్రత్యేక పరికరాలు అవసరం లేకుండా, బరువును అదుపులో ఉంచుతూ, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరిచే సులభమైన వ్యాయామం నడక. అయితే, రక్తంలో చక్కెర స్థాయులను నియంత్రించే విషయంలో నడక కన్నా ఓ మెట్టు పైనే నిలుస్తుంది మరో సులభమైన వ్యాయామం. అదే 'స్క్వాట్స్'.. అంటే గుంజీలు! రోజులో అప్పుడప్పుడు చేసే కొన్ని స్క్వాట్స్.. ఒకేసారి అరగంట పాటు చేసే నడక కన్నా మెరుగైన ఫలితాలు ఇస్తాయని తాజా పరిశోధనలో వెల్లడైంది.

2024లో ప్రచురితమైన "ఎన్‌హాన్స్‌డ్ మజిల్ యాక్టివిటీ డ్యూరింగ్ ఇంటరప్టెడ్ సిట్టింగ్ ఇంప్రూవ్స్ గ్లైసెమిక్ కంట్రోల్ ఇన్ ఓవర్‌వెయిట్ అండ్ ఒబేస్ మెన్" అనే పేరుతో ఒక అధ్యయనం నిర్వహించారు. ఇందులో భాగంగా అధిక బరువు, ఊబకాయంతో బాధపడుతున్న 18 మంది పురుషులను ఎంపిక చేసి, వారిపై పరిశోధన జరిపారు. వారిని నాలుగు గ్రూపులుగా విభజించి వేర్వేరు పనులు అప్పగించారు. ఒక బృందాన్ని కదలకుండా కూర్చోబెట్టగా, రెండో బృందంతో ఒకేసారి 30 నిమిషాలు నడిపించారు. మూడో బృందంతో ప్రతి 45 నిమిషాలకు చిన్న వాకింగ్ బ్రేక్ ఇప్పించగా, నాలుగో బృందంతో ప్రతి 45 నిమిషాలకు 10 స్క్వాట్స్ చేయించారు.

ఫలితాలను విశ్లేషించిన పరిశోధకులు ఆశ్చర్యపోయారు. కదలకుండా కూర్చున్న వారితో పోలిస్తే, ఏ రకమైన వ్యాయామం చేసినా ప్రయోజనం కనిపించింది. అయితే, ఒకేసారి అరగంట నడిచిన వారితో పోల్చినప్పుడు, ప్రతి 45 నిమిషాలకు పదేసి స్క్వాట్స్ చేసిన వారిలో భోజనం తర్వాత రక్తంలో చక్కెర స్థాయులు సుమారు 40 శాతం మెరుగ్గా అదుపులోకి వచ్చినట్లు గుర్తించారు.

### ఎందుకిలా జరుగుతుంది?

దీని వెనుక ఉన్న శాస్త్రీయ కారణాన్ని కూడా పరిశోధకులు వివరించారు. స్క్వాట్స్ చేసినప్పుడు మన శరీరంలోని అతిపెద్ద కండరాలైన తొడలు (క్వాడ్రిసెప్స్), పిరుదులు (గ్లూట్స్) చురుగ్గా పనిచేస్తాయి. ఈ కండరాలకు శక్తి అవసరమైనప్పుడు అవి రక్తంలోని గ్లూకోజ్‌ను గ్రహిస్తాయి. రోజంతా ఎక్కువసేపు కూర్చొని ఉండకుండా, మధ్యమధ్యలో స్క్వాట్స్ వంటి వ్యాయామాలు చేయడం వల్ల ఈ పెద్ద కండరాలు నిరంతరం గ్లూకోజ్‌ను వాడుకుంటూ ఉంటాయి. ఫలితంగా రక్తంలో చక్కెర స్థాయులు పెరగకుండా స్థిరంగా ఉంటాయి. ఎక్కువసేపు కదలకుండా కూర్చోవడం వల్ల శరీరం గ్లూకోజ్‌ను నియంత్రించే సామర్థ్యం క్రమంగా తగ్గిపోతుంది.

### నడక, స్క్వాట్స్.. రెండూ ముఖ్యమే

ఈ అధ్యయనం వల్ల నడక ప్రాముఖ్యత తగ్గిపోయినట్టు కాదు. బరువు నియంత్రణ, జీవక్రియను చురుగ్గా ఉంచడం, శరీరంలో కొవ్వు, కార్బోహైడ్రేట్ల వినియోగాన్ని సమర్థవంతంగా మార్చడం, గుండె ఆరోగ్యాన్ని కాపాడటం వంటి ఎన్నో ప్రయోజనాలు నడక వల్ల కలుగుతాయి. అదే సమయంలో స్క్వాట్స్ కాళ్ల కండరాలను బలోపేతం చేస్తాయి. శరీరానికి స్థిరత్వాన్ని అందిస్తాయి, ఎముకల సాంద్రతను పెంచుతాయి.

ముఖ్యంగా ఎక్కువ గంటలు కూర్చుని పనిచేసే ఉద్యోగులు, రక్తంలో చక్కెర స్థాయులను అదుపులో ఉంచుకోవాలనుకునే వారు, మధుమేహం ముప్పు ఉన్నవారు రోజువారీ నడకను కొనసాగిస్తూనే, ప్రతి గంటకు ఒకసారి లేచి కొన్ని స్క్వాట్స్ చేయడం ద్వారా అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# సినిమా న్యూస్



మిథిలా పాల్కర్ సాంప్రదాయ సౌందర్యం మరియు హుందాతనంతో మెరిసిపోతున్నారు. ఒత్తైన ముంగురులు (ఎబతీశ్రీఎ ష్ట్వుఅతీ), క్లాసిక్ లేత గోధుమ-బంగారు రంగు చీర, దానికి తగిన స్టైలిష్ ఎంబ్రాయిడరీ బ్లౌజ్ మరియు ఆకర్షణీయమైన సాంప్రదాయ ఆభరణాలతో ఆమె సహజమైన ఆకర్షణను, సాంప్రదాయ సౌందర్యాన్ని ప్రతిబింబిస్తున్నారు.

## నాగవంశీ మళ్లీ రిస్క్ చేయనున్నారా?

సినిమా నిర్మాణంలో కంటెంట్ ఎంత ముఖ్యమో.. రిలీజ్ ప్లానింగ్ కూడా అంతే కీలకం. ముఖ్యంగా ఒకే బ్యానర్ నుంచి తక్కువ గ్యాప్ లో రెండు సినిమాలు వస్తే.. వాటి మధ్య పోటీ, ప్రమోషన్లు, థియేటర్ల డిస్ట్రిబ్యూషన్ వంటి అంశాలు చర్చకు వస్తాయి. ఇప్పుడు సితార ఎంటర్టైన్మెంట్స్ అధినేత సూర్యదేవర నాగవంశీ అలాంటి సాహసానికే సిద్ధమవుతున్నారని టాక్ వినిపిస్తోంది. జులై 10న అక్కినేని అఖిల్ హీరోగా తెరకెక్కిన లెనిన్ విడుదలకు సిద్ధమవుతోంది. మరోవైపు అశోక్ గల్లా లీడ్ రోల్ లో రూపొందుతున్న వీసా జులై 31న ప్రేక్షకుల ముందుకు వచ్చే ఛాన్సులు కనిపిస్తున్నాయి. అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ.. ఆ రెండు సినిమాలు ఒకే నెలలో విడుదలయ్యే పరిస్థితి కనిపిస్తోంది. అదే జరిగితే సితారకు ఇది మరో ఆసక్తికరమైన పరీక్షగా మారనుంది. అయితే ఆ రెండు సినిమాలకూ ప్రత్యేకత ఉంది. ఇది గోల్డెన్ ఛాన్స్ అఖిల్ కు లెనిన్ చాలా కీలకం. వరుస ఫ్లాపుల తర్వాత ఆ చిత్రంపై ఆయన భారీ ఆశలు పెట్టుకున్నారు. రాయలసీమ నేపథ్యంలో యాక్షన్, ఎమోషన్, ప్రేమకథతో పాటు పీరియాడిక్ ఎలిమెంట్స్ కలిపి రూపొందించిన ఆ సినిమా ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాలి. మరోవైపు అశోక్ గల్లా వీసా.. అమెరికాలో చదువుకునే భారతీయ విద్యార్థుల జీవితాలు, ప్రేమ, ఎమోషన్స్ నేపథ్యంలో



తెరకెక్కిన ఆ చిత్రం యువతను లక్ష్యంగా చేసుకుని రూపొందింది. దీంతో రెండు సినిమాలను ఒకే నెలలో విడుదల చేయడం నాగవంశీది ధైర్యమైన నిర్ణయమే. ఒక సినిమా ప్రమోషన్లు జోరుగా సాగుతుండగా మరో సినిమా ప్రచారం మొదలవుతుంది. ఒకటి ఆశించిన స్థాయిలో ఆడకపోతే మరో సినిమాపైనా ప్రభావం పడే అవకాశం ఉంటుంది. అదే సమయంలో రెండు సినిమాలకు మంచి రెస్పాన్స్ వస్తే మాత్రం నిర్మాతకు డబుల్ సక్సెస్ దక్కినట్లే. అయితే నాగవంశీకి ఇలాంటి పరిస్థితులు పూర్తిగా కొత్తవి కావు. గతంలో కూడా తక్కువ గ్యాప్ లో సినిమాలను విడుదల చేసిన అనుభవం ఆయనకు ఉంది. 2022లో రెండు వారాల గ్యాప్ లో వచ్చిన డీజే టిల్లు, భీమ్లా నాయక్ మంచి ఫలితాలను అందుకున్నాయి. అలాగే 2023 అక్టోబర్ లో కూడా వరుసగా విడుదలైన చిత్రాలు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించాయి. అందుకే రిలీజ్ ప్లానింగ్ విషయంలో ఆయనకు లెక్కలు వేరేగా ఉంటాయని ఇండస్ట్రీలో చెప్పుకుంటుంటారు. అయితే ఈసారి పరిస్థితులు కొంత భిన్నంగా ఉన్నాయి. ఆ రెండు సినిమాలు కూడా కొత్త ఊపు కోసం ఎదురుచూస్తున్న యువ హీరోలవి. అందుకే ఒక్కో సినిమా రిజల్ట్ హీరోల ఫ్యూచర్ పై ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే ఒకే నెలలో రెండు సినిమాలు విడుదల చేయాలనే ధైర్యానికి బాక్సాఫీస్ కూడా తోడైతే ఆ ప్లాన్ సక్సెస్ అయినట్లవుతుంది. ఇప్పుడు అందరి దృష్టి ఒక్కటే. నాగవంశీ రిలీజ్ ప్లాన్ ఈసారి సక్సెస్ అవుతుందా? లేక ఒకే నెలలో రెండు సినిమాలు విడుదల చేయడం రిస్క్ గా మారుతుందా? అనే ప్రశ్నకు సమాధానం తెలియాలంటే వేచి చూడాలి.

## ప్రభాస్ ఫ్యాన్స్ ఎదురు చూపులకు తెర పడేది ఎప్పుడో?

ఈ ఏడాది ఆరంభంలో 'రాజాసాబ్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ప్రభాస్, మరో సినిమాను ఇదే ఏడాదిలో రిలీజ్ చేసే విధంగా ప్లాన్ చేస్తాడని అంతా భావించారు. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఫౌజీ సినిమా ఖచ్చితంగా 2026లోనే విడుదల ఉంటుందని మొన్నటి వరకు అంతా అనుకున్నారు. కానీ ప్రస్తుత పరిస్థితులను చూస్తూ ఉంటే ఫౌజీ సినిమా ఆలస్యం అయ్యే అవకాశం కనిపిస్తుంది. ఇప్పటి వరకు ఫౌజీ షూటింగ్ చకచక జరుగుతూ వచ్చింది. ఎప్పుడైతే సందీప్ రెడ్డి వంగ దర్శకత్వంలో స్పిరిట్ సినిమా మొదలైందో అప్పటి నుంచి ఫౌజీ ఆలస్యం అవుతుందని ఇండస్ట్రీ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. అందుకు కారణం స్పిరిట్ సినిమా షూటింగ్ ప్రారంభించినప్పటి నుంచి కంటిన్యూగా డేట్లు ఇవ్వాలని ప్రభాస్‌కి ముందుగానే సందీప్ రెడ్డి వంగ రిక్వెస్ట్ పెట్టుకున్నాడు. అందుకు ప్రభాస్ ఓకే అన్నాడట. ప్రభాస్ ఇచ్చిన మాట ప్రకారం స్పిరిట్ సినిమాకు బల్క్ డేట్లు ఇస్తూ వస్తున్నాడు. సందీప్ కోరిన సమయంలో ప్రభాస్ అందుబాటులో ఉంటున్నాడట. అంతే కాకుండా బాడీ డబుల్ లేకుండా పూర్తిగా ప్రభాస్ స్పిరిట్ సినిమా కోసం వర్క్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. దాంతో ప్రభాస్ కాస్త ఎక్కువ సమయం కేటాయించడంతో పాటు, ఎక్కువ కష్టపడుతున్నట్లు యూనిట్ సభ్యుల ద్వారా తెలుస్తోంది. స్పిరిట్ సినిమాను కేవలం ఆరు నెలల వర్కింగ్ డేస్‌తోనే పూర్తి చేసే విధంగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగ ప్లాన్ చేసుకున్నాడు. అందుకు తగ్గట్టుగా ప్రభాస్ నుంచి సహకారం అందుతుంది. దాంతో వచ్చే ఏడాదిలో అనుకున్న సమయంకు స్పిరిట్ సినిమా విడుదల ఉంటుందని సమాచారం అందుతోంది. అయితే ఫౌజీ సినిమా విషయంలో మాత్రం ఆలస్యం తప్పదని తెలుస్తోంది. స్పిరిట్ కోసం ఫౌజీ కాస్త ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తోంది. హను రాఘవపూడి ఫౌజీ మూవీ... హను రాఘవపూడి దర్శకత్వంలో సినిమా అంటే కూల్ అండ్ కామ్‌గా సాగుతుంది. ప్రభాస్ చాలా కాలం తర్వాత ఒక కంప్లీట్ ఫీల్ గుడ్ మూవీని చేస్తున్నాడని అభిమానులు చాలా ఉత్సాహంగా ఫౌజీ సినిమా కోసం వెయిట్ చేస్తున్నారు. సినిమా ఇదే ఏడాదిలో ఉంటుందని ఫ్యాన్స్ ఆశగా ఎదురు చూశారు. కానీ సినిమా షూటింగ్ జాప్యం కారణంగా ఈ ఏడాదిలో ఫ్యాన్స్ కి పండగ లేనట్లే అనిపిస్తుంది. హను రాఘవపూడి మూవీ అంటే మినిమం ఉంటుందని అన్ని వర్గాల వారు నమ్మకంగా ఉన్నారు. ఎప్పుడు వచ్చినా ఫౌజీ మినిమం గ్యారెంటీ హిట్ కొడుతుందని ఫ్యాన్స్ ధీమాతో ఉన్నారు. ముఖ్యంగా హను రాఘవపూడి గత చిత్రం సీతారామం సినిమా ఏ స్థాయి విజయాన్ని సొంతం చేసుకుందో తెలిసిందే. అందుకే ప్రభాస్ తో ఆ రేంజ్ సినిమా తీస్తే ఇండియన్ బాక్సాఫీస్ షేక్ కావడం ఖాయం అని బాక్సాఫీస్ వర్గాల వారు సైతం అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది విడుదల



కావాల్సిన రాజాసాబ్ సినిమా ఈ ఏడాది సంక్రాంతి కానుకగా వచ్చింది. సినిమా ఫలితం తీవ్రంగా నిరాశ పరిచింది. దర్శకుడు మారుతి ఇలా చేశాడేంటి అంటూ తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. ఆ సమయంలోనే రాబోయే మూవీ ఫౌజీ కనుక ఈ డ్యామేజీ అంతా కంట్రోల్ చేస్తుందని ఫ్యాన్స్ భావించారు. సాధారణంగా ఏ హీరో అయినా ఒక మూవీ నిరాశ పరిస్తే వెంటనే మరో సినిమాను వదలాలి అనుకుంటారు.. కానీ ప్రభాస్ అలా కాకుండా స్లో అండ్ స్టడీ అన్నట్లుగా ముందుకు సాగుతున్నాడు. ఏడాదిలో కచ్చితంగా రెండు సినిమాలు చేస్తాను, విడుదల చేస్తాను అని గతంలో ప్రభాస్ ఇచ్చిన హామీ ఈసారి కూడా నిలబెట్టుకునే పరిస్థితి లేనట్లే. ఫౌజీ, స్పిరిట్ సినిమాలు వచ్చేది ఎప్పుడో...? ప్రభాస్ ఫ్యాన్స్ ఎదురు చూపులకు తెర పడేది ఎప్పుడో కాలమే నిర్ణయించాలి. ఈ రెండు సినిమాలు మాత్రమే కాకుండా ప్రభాస్ సలార్, కల్కి 2 సినిమాలు సైతం ఫ్యాన్స్ ను ఊరిస్తున్నాయి. వాటి కోసం ఎదురు చూపులు ఎన్నాళ్ళు కొనసాగాలో చూడాలి.

## సీఎం సార్ సినిమాకు ముహూర్తం ఖరారు..!



స్టార్ హీరోల సినిమాలు ఈ మధ్య కాలంలో అను కున్న సమయానికి రాక పోవడం కామన్ అయింది. అందుకు షూటింగ్ ఆలస్యం కావడం, వీఎఫ్ఎక్స్ వర్క్ ఆలస్యం కావడం మనం చూస్తూ ఉంటాం. కానీ షూటింగ్ పూర్తి చేసుకుని, వీఎఫ్ఎక్స్ వర్క్ సైతం పూర్తి చేసుకుని విడుదల కాకుండా ఆగిన సినిమాలు చాలా తక్కువగా ఉంటాయి. సూపర్ స్టార్ రేంజ్ హీరోల సినిమాలు అలా ఆగడం దాదాపు కనిపించదు. కానీ తమిళ సూపర్ స్టార్ విజయ్ నటించిన జన నాయగన్ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రేక్షకుల ముందుకు రాలేక పోయింది. దాదాపు ఆరు నెలలుగా దర్శక నిర్మాతలు జన నాయగన్ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. సీఎం రాజకీయ అరంగేట్రం నేపథ్యంలో ఆయన చివరి మూవీగా జన నాయగన్ ను ప్రచారం చేస్తూ వచ్చారు. అదే రాజకీయం కారణంగా సినిమా విడుదల కాకుండా ఆగి పోయిందనే ఆరోపణలు ఉన్నాయి. జన నాయగన్ సినిమా రిలీజ్... విజయ్ ప్రత్యర్థులు జన నాయగన్ సినిమా విడుదలను అడ్డుకుంటున్నారని అభిమానులు అంటున్నారు. ఇప్పుడు విజయ్ తమిళనాడు సీఎం అయ్యాడు. కనుక జన నాయగన్ సినిమా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎన్ని సెంటర్స్ అంటే అన్ని సెంటర్స్‌లో రిలీజ్ అయ్యే అవకాశం ఉంది. సీఎంగా ఇన్ని రోజులు బిజీ బిజీగా ఉన్న విజయ్ ఇప్పుడు జన నాయగన్ సినిమా విడుదల విషయమై నిర్మాతలతో చర్చలు జరిపినట్లుగా తెలుస్తోంది. ఇటీవలే జన నాయగన్ సినిమా నిర్మాతకు విజయ్ కీలకమైన నామినేటెడ్ పదవి ఇవ్వడం అందరి దృష్టిని ఆకర్షించింది. జన నాయగన్ సినిమా విడుదల విషయంలోనూ విజయ్ నుంచి సహకారం అందినట్లుగా నిర్మాణ సంస్థకు చెందిన ప్రతినిధులు అంటున్నారు. తమిళ సినీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం సినిమాకు సెన్సార్ కంప్లీట్ చేసి ఇదే నెలలో విడుదల చేయాలని నిర్మాత భావిస్తున్నాడు. బాలకృష్ణ భగవంత్ కేసరి రీమేక్... తెలుగు మూవీ భగవంత్ కేసరికి కాస్త మార్పులు చేర్పులు చేసి జన నాయగన్ సినిమాను రూపొందించారు. బాలకృష్ణ పోషించిన పాత్రను విజయ్ పోషించగా, కాజల్ పోషించిన పాత్రను పూజా హెగ్డే పోషించినట్లు తెలుస్తోంది. సినిమాలో శ్రీలీల పాత్ర అత్యంత కీలకంగా ఉంటుంది. ఆ పాత్రను తమిళ్‌లో మమితా బైజు పోషించింది. తెలుగు సినిమాకు రీమేక్ అయినప్పటికీ చాలా మార్పులు చేయడంతో పాటు, నేటివిటీ సైతం మార్చడం వల్ల తెలుగు ప్రేక్షకులు న్యూ మూవీగా ఫీల్ అవుతారనే ఉద్దేశంతో తెలుగు రాష్ట్రాల్లోనూ భారీ ఎత్తున విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. జులై 23 లేదా 24న ప్రేక్షకుల ముందుకు జన నాయగన్ రావడం ఖాయం అంటూ తమిళ సినీ వర్గాల నుంచి సమాచారం అందుతోంది. ఇప్పటికే సెన్సార్ కార్యక్రమాలు జరిగాయని, సెన్సార్ బోర్డ్ నుంచి ఎ సర్టిఫికెట్ సైతం వచ్చిందనే వార్తలు తమిళ మీడియాలో గుప్పుమంటున్నాయి. తమిళ నాడు సీఎం విజయ్ చివరి సినిమా... విజయ్‌కి ఉన్న క్రేజ్ నేపథ్యంలో జన నాయగన్ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఇప్పుడు విజయ్ ఏకంగా సీఎం అయ్యాడు. పైగా ఆయన చివరి మూవీ కావడంతో తమిళనాట ఓపెనింగ్స్ నెవ్వర్ బిఫోర్ అన్నట్లుగా నమోదు కావడం ఖాయం అని బాక్సాఫీస్ వర్గాల వారు అంచనా వేస్తున్నారు. ఇక తెలుగు రాష్ట్రాల్లో సినిమాను భారీ ఎత్తున విడుదల చేయడం ద్వారా మంచి ఓపెనింగ్స్‌ను ఆశిస్తున్నారు. విజయ్‌కి ఉన్న ఫాలోయింగ్ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లోనూ భారీ నెంబర్స్ నమోదు అయ్యే అవకాశం ఉంది. ఈ నెలలో పెద్ద సినిమాలు, తెలుగు స్టార్ హీరోల సినిమాలు లేకపోవడం కలిసి వచ్చే అంశం అంటూ బాక్సాఫీస్ వర్గాల వారు విశ్లేషిస్తున్నారు.



## దసరా వార్‌లో మెగాస్టార్ ఎంట్రీ?

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న ప్రతిష్ఠాత్మక సినిమా విశ్వంభర గురించి మరోసారి ఇండస్ట్రీలో చర్చ జోరందుకుంది. చాలా కాలంగా రిలీజ్ డేట్ పై క్లారిటీ కోసం వెయిట్ చేస్తున్న ఫ్యాన్స్ కు త్వరలోనే శుభవార్త వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. చిత్ర బృందం దసరా సీజన్‌ను టార్గెట్ గా పెట్టుకుని పనులను వేగవంతం చేస్తోందనే టాక్ వినిపిస్తుండటంతో, అక్టోబర్‌లో మెగాస్టార్ సందడి దాదాపు ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

దసరా అనేది తెలుగు సినీ పరిశ్రమకు అత్యంత కీలకమైన సీజన్‌లలో ఒకటి. హాలిడేస్, ఫ్యామిలీ ఆడియన్స్ సపోర్ట్, పండుగ వాతావరణం కలిసి పెద్ద సినిమాలకు భారీ ఓపెనింగ్స్ అందించే సీజన్ కావడంతో, ఈ సీజన్‌పై స్టార్ హీరోల దృష్టి ఎప్పుడూ ఉంటుంది. అలాంటి టైమ్ లో చిరంజీవి సినిమా వస్తే బాక్సాఫీస్ ఈక్వేషన్స్ సహజంగానే మారిపోతాయి. ఇప్పటికే అదే సీజన్‌ను పరిశీలిస్తున్న ఇతర సినిమాల రిలీజ్ ప్లాన్స్ పై కూడా దీని ప్రభావం ఉండొచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410.
Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662